కనులపండువగా గోదాదేవి కల్యాణం



ఆర్యవైశ్య కల్యాణమండపంలో జరిగిన కల్యాణోత్సవం




పట్టణ వీధుల్లో
స్వామి, అమ్మవారి గ్రామోత్సవం

పీలేరు, జనవరి 16: పీలేరు ఆర్యవైశ్య కల్యాణమండపంలో మంగళవారం గోదాదేవి, రంగనాయకుల స్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. సంక్రాంతి సంబరాల్లో భాగంగా కనుమ రోజున పీలేరులో ప్రతి ఏడాది ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణోత్సవం జరిపించడం ఆనవాయితీ. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ స్థానిక నెహ్రూబజారులోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలోని గోదాదేవి, రంగనాథస్వామి ఉత్సవ విగ్రహాలను ఆర్యవైశ్య సంఘ సభ్యులు మంగళవారం పట్టణ వీధుల్లో ఊరేగింపుగా స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపానికి తరలించారు. అక్కడ వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారికి స్వామి వారు కల్యాణధారణ చేశారు. అనంతరం చిన్నారులకు భగవద్గీత, మహిళలకు కోలాటం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వాసవీ, వాసవీ మహిళా సంఘ సభ్యులు కూనా సత్యం, పామిడి మల్లికార్జున, ముచ్చెర్ల బాబు, పామిడి మహేశ్, సోమిశెట్టి సురేశ్, జయచంద్ర, గ్రంధి నరసింహులు శెట్టి, జూటూరు అరవింద్, పామిడి మహాలక్ష్మి, రేవూరి రాణి, పామిడి సునీత, తదితరులు పాల్గొన్నారు.

జల్లెడ నయం

- వెలిగల్లు నీళ్లు ఏటి పాలు
- కుడికాలువ నుంచి వృథాగా పోతున్న నీరు
- నీటి వృథాను అరికట్టాలని రైతుల విజ్ఞప్తి



వెలిగల్లు ప్రాజెక్టులో భారీగా తగ్గిపోయిన నీటిమట్టం

గాలివీడు, జనవరి 16: ఈ ప్రాంతం కరువు కాటకాలకు నిలయం. సకాలంలో వర్షాలు కురిస్తే పంటలు సాగు చేస్తారు. లేదంటే భూములన్నీ బీళ్లుగా దర్శనమిస్తాయి. ఈ కరువు గడ్డ మీద రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం వెలిగల్లు సాగు ప్రాంత రైతులకు శాపంగా మారింది. వెలిగల్లు ప్రాజెక్టు కుడికాలువ నుంచి పారుతున్న సాగునీరు వృథాగా ఏటి పాలవుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కాలువలకు లైనింగ్ వేయడంలో నిర్లక్ష్యం వహించడంతో నీళ్లన్నీ కాలువ కింద జల్లెడ మాదిరిగా కారిపోతున్నాయి. కరువు కాటకాలకు నిలయమైన రాయచోటి నియోజకవర్గంలోని గాలివీడు మండల కేంద్రానికి సమీపంలో పాపాఘ్ని నది మీద 2008లో సుమారు 208 కోట్ల రూపాయలతో వెలిగల్లు ప్రాజెక్టు నిర్మించారు. 4.64 టీఎంసీల నీటి సామర్థ్యంతో నిర్మించిన ఈ ప్రాజెక్టు కుడికాలువ 58 కిలోమీటర్ల పరిధిలో 23,400 ఎకరాల సాగు భూమి కలదు. ఎడమకాలువ 10 కిలోమీటర్ల పరిధిలో 600 ఎకరాల సాగు భూమి కలదు. మొత్తం కుడి, ఎడమ కాలువలు, ఉపకాలువల కింద 24 వేల ఎకరాల ఆయకట్టు ఉంది.

జల్లెడ మాదిరి కారిపోతున్న కుడికాలువ

గత రెండు సంవత్సరాల కాలంలో వెలిగల్లు ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నిండింది. కానీ వైసీపీ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి కాలువలను పట్టించుకోకపోవడం వల్ల అవి కొంత మేర దెబ్బతిన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. రైతుల ఆరోపణలను దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం హడావుడిగా కాలువల్లోని చెట్లను తొలగించి కాలువలకు నీటిని విడుదల చేశారు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాలకు నీరు అందిస్తున్న కుడికాలువ కేవలం 15 కిలోమీటర్ల పరిధిలో మాత్రమే లైనింగ్ వేశారు. మిగతా కాలువలకు లైనింగ్ వేయకపోవడంతో నీరు అంతా ఎక్కడ చూసినా కారిపోయి వృథాగా పోతున్నాయి. ముఖ్యంగా పందికుంట, కొర్లకుంట, పూలుకుంట పంచాయతీల పరిధిలో వెళుతున్న కాలువకు లైనింగ్ లేదు. పందికుంట, కొర్లకుంట పంచాయతీ పరిధిలో కొండ వారంతా కాలువ వెళుతుండడంతో జల్లెడ మాదిరి నీళ్లు అన్ని ఇక్కడే కారిపోతున్నాయి. లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో వెళుతున్న కాలువకు కూడా లైనింగ్ లేకపోవడం వల్ల చాలా వరకు నీరు వృథాగా పోతున్నాయని రైతులు తెలిపారు. ఆగస్టు 9న గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం మండలాల్లో కుడికాలువ ఆయకట్టు పరిధిలో చెరువులను, కుంటలను నింపడానికి అధికారులు నీటిని విడుదల చేశారు. గాలివీడు, లక్కిరెడ్డిపల్లె మండలాల్లో చెరువులు దాదాపు పూర్తయినట్లు సమాచారం. ప్రాజెక్టులో మూడు నెలల కాల వ్యవధిలోనే 4.5 టీఎంసీల నుంచి 2.8 టీఎంసీలకు నీరు తగ్గిపోయింది. దీనిని బట్టి నీరు ఎంత వృథా అయ్యిందో అర్థమవుతుంది.

మరమ్మతులకు నోచుకోని పిల్ల కాలువలు

వెలిగల్లు ప్రాజెక్టుకు ఉన్న కుడి, ఎడమ కాలువలు కింద 140 కిలోమీటర్లు పిల్ల కాలువలు కలవు. ఈ పిల్లకాలువలు మట్టి, చెట్లతో నిండిపోయాయని, వీటి గుండా నీళ్లు పారే పరిస్థితి లేదని రైతులు పేర్కొన్నారు. ప్రధాన కాలువ ద్వారా కొంత మేరకే భూమి సాగులోకి వస్తుందని పిల్ల కాలువల కింద అధిక మొత్తంలో సాగు భూమి ఉందని చెబుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో తామే పిల్ల కాలువలు శుభ్రం చేసుకున్నామని రైతులు తెలియజేశారు. పిల్లకాలువల గుండా నీరు వెళితే అధిక విస్తీర్ణంలో పంటలను సాగు చేసుకోవచ్చునని పేర్కొన్నారు. పిల్ల కాలువలను ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో కొన్ని కాలువలు పూడిపోయాయని, మరికొన్ని కాలువలు దెబ్బతిన్నాయన్నారు. ప్రధాన కాలువ గుండా రోజుకు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. రామాపురంలో చివరి ఆయకట్టుకు వెళ్లేటప్పటికీ కనీసం 40 క్యూసెక్కుల నీరు కూడా వెళ్లలేదని పలువురు రైతులు ఆరోపించారు. ఏది ఏమైనా వెలిగల్లు కుడికాలువ కింద వృథాగా వెళ్లే నీటిని అరికట్టాలని రైతులు పేర్కొన్నారు.



లైనింగ్‌కు నోచుకోని వెలిగల్లు కాలువ



పందికుంట సమీపంలో గడ్డితో నిండిపోయిన పిల్ల కాలువ



తూపల్లె సమీపంలో కుడికాలువ నుంచి కారుతున్న నీరు

వృథాగా వెళుతున్న నీటిని అరికట్టాలి..



వెలిగల్లు కుడికాలువ కింద వృథాగా కారిపోతున్నా నీటిని అరికట్టలేదు. పందికుంట సమీపంలోని కుడికాలువ కింద ఉన్న భూములు అన్నీ ఊట ఎక్కాయి. ప్రస్తుతం ఆ భూముల్లో ఎలాంటి పొలాలను సాగు చేయడానికి వీలు లేదు. భూములు ఊట ఎక్కడానికి కారణం కాలువల కింద నీరు పారడమే. కాలువకు సిమెంటుతో లైనింగ్ వేయకపోవడం వల్ల నీళ్లు జల్లెడ మాదిరి కారిపోతున్నాయి. ప్రభుత్వం స్పందించి ఈ ఏడాది వేసవి కాలంలోనైనా లైనింగ్ పనులు చేపట్టి కాలువల లీకేజీలను అరికట్టాలి.

- పల్లెపు వెంకటేశ్, పందికుంట


ఫిబ్రవరి లేదా మార్చిలో నీటిని విడుదల చేయాలి..



ప్రస్తుతం కుడికాలువ కింద ఉన్న చెరువులు, కుంటలు పూర్తిగా నిండిపోయాయి. రైతులు కూడా చెరువులు, బావుల కింద వేరుశనగను సాగు చేశారు. ఇంకా రెండు నెలల వరకు ఈ పంటకు నీరు అవసరం లేదు. చెరువులు పూర్తిగా నిండిపోవడం వల్ల నీళ్లన్నీ వృథాగా ఏటికి చేరుతున్నాయి. నీరు వృథాగా పోవడం కంటే ప్రాజెక్టులో నిలువ ఉండడం ఎంతో మంచిది. రైతులకు అవసరమైనప్పుడు తిరిగి కాలువలకు వదిలితే ఎంతో ఉపయోగం.

- దేరంగుల ఓబులేసు, చావిడిపల్లి

లైనింగ్‌ను పూర్తి చేయాలి..



వెలిగల్లు కుడి కాలువకు లైనింగ్ లేకపోవడం వల్ల నీరు అంతా వృథాగా కారిపోయి ఏటికి చేరాయి. నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం కాలువలను పట్టించుకోకపోవడం వలనే ఈ దుస్థితి ఏర్పడింది. కాలువల నిర్వహణ సక్రమంగా చేసి ఉంటే నీరు వృథాగా పోయేవి కావు. కొంతమంది రాజకీయ నాయకుల ప్రయోజనాల కోసం అవసరం లేకున్నా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈ ఎండల కాలంలోనైనా ప్రభుత్వం స్పందించి కాలువలకు లైనింగ్‌ను పూర్తి చేసి నీటి వృథాను అరికట్టాలి.

- పేరం ప్రభాకర్‌రెడ్డి

టీడీపీ గూటికి 40 మంది ఎమ్మెల్యేలు!

- మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లెటౌన్, జనవరి 16: వైసీపీ ఎమ్మెల్యేలలో 70 మందికి టికెట్ ఇవ్వడం కుదరదని జగన్ చెప్పారని, ఇందులో 40 మంది టీడీపీ గూటికి చేరడం ఖాయమని మదనపల్లె టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక బెంగళూరు బస్టాండు వద్ద గల టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వైనాట్ 175 అంటూ ప్రగల్భాలు పలికిన సీఎం జగన్ ఇప్పుడు 25 సీట్లు అయినా వస్తాయా అన్న సందిగ్ధంలో పడిపోయారన్నారు. నాలుగేళ్లకు పైగా తాడేపల్లె ప్యాలెస్‌లో మొద్దు నిద్రపోయిన జగన్ ఇప్పుడు మేల్కొన్నా అతడి పాపం పండిపోయిందన్నారు. ప్రజలు ఇప్పుడు జగన్ పాలన వద్దంటున్నారని, వారిలో 40 మంది ఎమ్మెల్యేలు కూడా తమకు జగన్ వద్దని టీడీపీ వైపు చూస్తున్నారన్నారు. మదనపల్లె నియోజకవర్గం అభివృద్ధికి నోచుకోలేకపోయిందని దీనికి స్థానిక ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఎంపీ మిథున్‌రెడ్డిలే కారణమన్నారు. అంతే కాకుండా మదనపల్లె కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు కాకుండా మిథున్‌రెడ్డి అడ్డుకున్నారని, ఇప్పుడు మదనపల్లె ప్రజలే మిథున్‌రెడ్డికి బుద్ధి చెబుతారన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న ఐదేళ్ల కాలంలో మదనపల్లె నియోజకవర్గంలో రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టానని గుర్తు చేశారు. నారావారిపల్లెలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌ను కలసి మదనపల్లెలో టీడీపీ బలోపేతానికి చేపడుతున్న కార్యక్రమాల గురించి వివరించానని తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు నాదెళ్ల శివన్న, బాలుస్వామి, షంషీర్, నవీన్, నాగూర్‌వలి, కె.కృష్ణ, రఘునాథ, హసీనా, నాగమణి, ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

కోలాహలంగా కనుమ పండుగ

- చిట్లాకుప్ప దహనంతో ముగిసిన సంక్రాంతి సంబరాలు
- పీలేరులో ప్రత్యేక ఆకర్షణగా ముస్లింలు

పీలేరు, జనవరి 16: జనాన్ని చూసి కంగారు పడే ఎద్దులు, వాటిని కవ్విస్తూ యువకుల కేరింతలు, కాటమరాజుకు మహిళల పూజలు, చిన్నారులకు వివిధ పోటీల నడుమ సంక్రాంతి సంబరాల్లో ఆఖరి ఘట్టమైన కనుమ పండుగను మంగళవారం పీలేరు మండల ప్రజలు కోలాహలంగా జరుపుకున్నారు. పెద్ద పండుగైన సంక్రాంతికి ఎక్కడెక్కడో స్థిరపడిన వారందరూ సొంతూళ్లకు పెద్దఎత్తున హాజరు కావడంతో పీలేరు మండలంలోని అధిక గ్రామాల్లో చిట్లాకుప్ప కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. పీలేరు పట్టణంలో కామాటంవారిపల్లె, కట్టుకాలువ వీధి, కావలిపల్లె ప్రాంతాల్లో మంగళవారం చిట్లాకుప్ప కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహించారు. పీలేరు పట్టణంలోని రైతులు, పశువుల యజమానులు తమ పశువులను సుందరంగా అలంకరించుకుని ఆయా ప్రాంతాల్లోని ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన చిట్లాకుప్పల వద్దకు తోడ్కొని వచ్చారు. ఎద్దులు, ఆవులకు సుందరంగా అలంకరించిన బుడ్డలు, పూలను తెంపేందుకు యువకులు పోటీలు పడుతుండగా వారి హడావిడికి భయపడి అటూ ఇటూ పరుగెత్తుతున్న పశువులతో ఆయా చిట్లాకుప్ప ప్రాంగణాలు సందడిగా మారాయి. చిట్లాకుప్పకు హాజరయ్యే వారి కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన ఎద్దుల అలంకరణ, మ్యూజికల్ చైర్స్, గాలిపటాల ఎగరేత పోటీల్లో మంగళవారం మధ్యాహ్నం నుంచి చాలా మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కామాటంవారిపల్లె వద్ద జరిగిన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి పీలేరు సర్పంచ్ జీనత్, జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షామియాన షఫీ బహుమతులు అందజేశారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచేలా చిట్లాకుప్ప దహన కార్యక్రమంలో పట్టణంలోని ముస్లింలు పెద్దఎత్తున పాల్గొన్నారు. చిట్లాకుప్పకు నిప్పంటించగా కార్యక్రమానికి హాజరైన ప్రజలందరూ దానిచుట్టూ ప్రదక్షిణలు చేశారు. కావలిపల్లెలో జరిగిన వేడుకల్లో కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో కాటమరాజు ఆలయ ధర్మకర్తలు పోతంశెట్టి ప్రభాకర, పోతంశెట్టి రమేశ్, శ్రీకృష్ణం చందు, శ్రీరామ కనకరాజా, కె.శ్రీనివాసమూర్తి, ఉత్సవ కమిటీ సభ్యులు మనోహర, మోహన, పిక్కా రమణ, జ్ఞానం గారి శ్రీధర్, పీవీ రమణ, చలపతి, మనోహర, బళ్లారి రామ్మూర్తి, ప్రసాద్, పవన్, జ్ఞాన, చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు. కాగా చిట్లాకుప్ప కార్యక్రమాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో ఎస్‌ఐలు నరసింహుడు, రమణ తమ సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



చిట్లాకుప్ప వద్ద పీలేరు పట్టణ ప్రజలు

రణరంగమైన పీలేరు ప్రభుత్వాసుపత్రి

- ఒకేరోజు రెండు ఘటనలు
- ఆసుపత్రిలో పరస్పరం దాడి చేసుకున్న ఇరువర్గాలు
- వైద్యం అందించలేదని ఆరోపిస్తూ వైద్య సిబ్బందిపై దాడికి యత్నం



ఆసుపత్రిలో దాడి చేసుకుంటున్న తలపుల వాసులు

పీలేరు, జనవరి 16: పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి సోమవారం రెండుసార్లు రణరంగాన్ని తలపించింది. గ్రామంలో జరిగిన ఘర్షణలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిపై ప్రత్యర్థులు దాడికి తెగపడడం ఒకటి కాగా పురుగుల మందు తాగిన వ్యక్తికి సరైన వైద్యం అందించడం లేదంటూ మద్యం మత్తులో వైద్య సిబ్బందిపై దాడికి యత్నించిన సంఘటన మరొకటి. పీలేరు మండలం తలపుల పంచాయతీ లేమాటివారిపల్లెకు చెందిన నరసింహులు నాయుడు, హరినాయుడుల మధ్య మాటామాటా పెరిగి ఒకరిపై మరొకరు దాడి చేసుకోవడంతో ఇద్దరికీ గాయాలయ్యాయి. దీంతో వారిద్దరినీ చికిత్స నిమిత్తం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న ఇరువర్గాల వారు పెద్దఎత్తున పీలేరు ఆసుపత్రికి చేరుకుని అక్కడ చికిత్స పొందుతున్న ప్రత్యర్థి వర్గంపై దాడికి దిగారు. ఒకరిపై మరొకరు పిడిగుద్దులు కురిపిస్తూ, ఆసుపత్రిలో సెలైన్ బాటిళ్ల స్టాండ్లతో కొట్టుకున్నారు. ఈ హఠాత్పరిణామంతో భీతిల్లిన ఆసుపత్రి సిబ్బంది, రోగులు భయభ్రాంతులకు గురయ్యారు. సుమారు అరగంట పాటు ప్రత్యర్థులు కొట్టుకున్నారు. చివరకు ఆసుపత్రి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వారు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మద్యం మత్తులో వైద్యుడిపై దాడికి యత్నం

తలపుల సంఘటన మరవకముందే సోమవారం రాత్రి పీలేరు ఆసుపత్రిలో మరో సంఘటన చోటు చేసుకుంది. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం ఈ.రామిరెడ్డిగారిపల్లెకు చెందిన చిన్నగురప్ప అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీనిని గమనించిన కుటుంబసభ్యులు అతడిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న అతడి బంధువులు, మరికొంతమంది గ్రామస్థులు ఆసుపత్రికి చేరుకున్నారు. అప్పటికే వైద్యం ప్రారంభించిన వైద్యుడు శ్రీనివాసనాయక్, ఇతర సిబ్బందితో త్వరగా వైద్యం అందించాలని గొడవకు దిగారు. తాము పద్ధతి ప్రకారం వైద్యం చేస్తున్నామని వైద్యులు చెప్పినా వినకుండా మద్యం మత్తులో ఉన్న యువకులు డాక్టరును బూతులు తిడుతూ దాడికి పాల్పడే ప్రయత్నం చేశారు. విధుల్లో ఉన్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులు ఆయనను తప్పించారు. అంతటితో ఆగకుండా వారు చిన్నగురప్పకు అమర్చిన ఈసీజీ మెషీను, సక్షన్ మెషీన్‌లను ధ్వంసం చేయడమే కాకుండా వాటికి ఉండే మానిటర్‌ను తమ వెంట తీసుకెళ్లిపోయారు. అంతేకాకుండా చిన్నగురప్పను తాము తిరుపతిలో చూపించుకుంటామంటూ తీసుకెళ్లిపోయారు. ఈ సంఘటనతో భీతిల్లిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఆసుపత్రికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

విధుల బహిష్కరణ యోచనలో వైద్య సిబ్బంది

దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ విధుల బహిష్కరణకు వైద్య సిబ్బంది పూనుకున్నారు. అయితే పులిచెర్ల మండలం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న పుంగనూరు నియోజకవర్గంలోనిది. సోమవారం రాత్రి పీలేరు ఆసుపత్రిలో హంగామా చేసిన వారు కూడా వైసీపీ నాయకులు, సానుభూతిపరులని తెలిసింది. విషయం తెలుసుకున్న కొంతమంది పులిచెర్ల మండల వైసీపీ నాయకులు ఆసుపత్రి సామాగ్రిని తాము కొనుగోలు చేసి ఆసుపత్రికి అప్పగిస్తామని ఆసుపత్రి వైద్యులను మంగళవారం ఉదయం కోరినట్లు తెలిసింది. అంతే కాకుండా చూసీచూడనట్లు పొమ్మని ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వయంగా ఫోను చేసినట్లు మంగళవారం పీలేరులో పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ తలపులకు సంబంధించిన దాడిలో తాము పోలీసులకు సమాచారం అందించిన వెంటనే వారు వచ్చి ఇరువర్గాలను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేశారన్నారు. పులిచెర్ల మండలానికి సంబంధించిన కేసులో పేషెంటు వివరాలు తప్ప తమ వద్ద ఎటువంటి సమాచారం లేకపోవడంతో కేసు నమోదులో ఆలస్యమైందన్నారు. రోగులు చికిత్స పొందే ఆసుపత్రిలో దాడులకు పాల్పడడం, వైద్యులను దుర్భాషలాడడం, సిబ్బందిపై దాడికి యత్నించడం మంచి పద్ధతి కాదని, అటువంటి పనుల వల్ల నష్టపోయేది రోగులేనని ఆయన తెలిపారు. పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి మాట్లాడుతూ తలపులకు సంబంధించిన దాడి ఘటనలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని, పులిచెర్ల మండలానికి చెందిన సంఘటనలో ఆసుపత్రిలో వీరంగం చేసిన వారి కోసం విచారిస్తున్నామన్నారు. వారి వివరాలు లభించిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు.





ధ్వంసమైన ఈసీజీ మెషీన్, డాక్టర్ శ్రీనివాస నాయక్‌ను బెదిరిస్తున్న పులిచెర్ల యువకుడు

వైభవంగా చద్ది అన్నపు సంబరాలు

- పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు

పెనగలూరు, జనవరి 16: మండల పరిధిలోని వెలగచర్ల గ్రామంలో కనుమ పండుగను పురస్కరించుకుని మంగళవారం గ్రామ దేవత అంకాళమ్మకు సంప్రదాయ పద్ధతిలో చద్ది అన్నపు సంబరాలను గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించుకున్నారు. ప్రతి ఏడాది కనుమ పండుగ నాడు గ్రామస్థులు ఐకమత్యంతో అత్యంత ఆనందోత్సాహాల నడుమ ఈ కార్యక్రమాన్ని గ్రామదేవత అంకాళమ్మకు ఆనవాయితీగా నిర్వహించుకుంటూ వస్తున్నారు. గ్రామ ప్రజలే కాకుండా పరిసర గ్రామాల ప్రజలు ఈ వైభవాన్ని తిలకించేందుకు వెలగచర్లకు చేరుకున్నారు. గ్రామ ప్రజలు తమ ఇంటిలో తయారు చేసిన చద్ది అన్నాన్ని అంకాళమ్మ గుడి ముందు కుంభం కూడు పోశారు. ఈ విధంగా అంకాళమ్మ తల్లికి చద్ది అన్నం సమర్పించడం వల్ల ఏడాది పొడవునా గ్రామప్రజలు ఆయురారోగ్యాలు, పాడిపంటలతో సుభిక్షంగా ఉంటారని నమ్మకం. ఈ కార్యక్రమం గ్రామ ప్రజల పర్యవేక్షణలో యూత్ సభ్యుల ప్రోత్సాహంతో వైభవంగా జరిగింది.



అమ్మవారి గుడి ముందు సంప్రదాయబద్ధంగా సమర్పించిన చద్ది అన్నపు కుంభం కూడు



గుడి వద్ద ఉత్సవంలో పాల్గొన్న భక్తులు



వెలగచర్ల గ్రామంలో గ్రామ దేవత అంకాళమ్మ

కోడిపందెం రాయుళ్లు అరెస్టు

రూ.10,850 నగదు స్వాధీనం


కోడిపందెం రాయుళ్లను అరెస్టు చేసిన పోలీసులు

పోరుమామిళ్ల, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా ఎల్లవపల్లెలో కోడిపందేలు ఆడుతున్న 12 మందిని అరెస్టు చేసి వారి నుంచి కోడి సహా రూ.10,800 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పోరుమామిళ్ల ఇన్‌చార్జ్ ఎస్ఐ అమర్‌నాథరెడ్డి తెలిపారు. అందిన సమాచారం మేరకు ఎల్లవపల్లె సమీపంలో పేకాడుతున్నట్లు తమ దృష్టికి రావడంతో దాడులు నిర్వహించామన్నారు. కొందరు పరారీ అయ్యారని, 12మంది, కోడి, నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

శెట్టిగుంట పంచాయతీలో...


కోళ్లు నిందితులతో పోలీసులు

రైల్వే కోడూరు(రూరల్) జనవరి 16: శెట్టిగుంట పంచాయతీ మామిడి తోటలో సోమవారం కోడి పందెం ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 12930 నగదు, ఏడు పందెం కోళ్లు, రెండు చిన్న కత్తులు స్వాధీనం చేసుకున్నారు, మంగళవారం రెడ్డివారిపల్లి పంచాయతీలో దాడులు నిర్వహించి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5110 నగదు, ఆరు పందెం కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ దాడుల్లో సిబ్బంది షేక్ ఆఖిఫ్, చంద్ర, పుష్పరాజ్ పాల్గొన్నారు.

జౌకుపల్లెలో ఫుట్‌బాల్ టోర్నమెంటు

- డే అండ్ నైట్ ఆడిన క్రీడాకారులు


ఫుట్‌బాల్‌లో ఆడుతున్న క్రీడాకారులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 16: జౌకుపల్లెలో లక్ష్య అకాడమి, బసవ ఫుట్‌బాల్ క్లబ్ కడప ఆధ్వర్యంలో జౌకుపల్లె యూత్ సభ్యులు సంక్రాంతి పండుగ సందర్భంగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో డే అండ్ నైట్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లు నిర్వహించారు. ఈ పోటీల్లో కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు జిల్లాల నుండి 16 జట్లు పాల్గొన్నాయి. ఫుట్‌బాల్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ శాప్ డైరెక్టరు డానియల్ ప్రదీప్, చంద్రమోహన్‌రెడ్డి, కడప జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కోచ్ సుధీర్, వైస్‌ప్రెసిడెంట్ థామస్ హాజరయ్యారు. పోటీల్లో ఫ్రెండ్స్ ఫుట్ బాల్ జట్టు కడప మొదటి విజేతగా నిలిచి రూ.30వేలు, బసవ ఫుట్‌బాల్ జట్టు జౌకుపల్లె ద్వితీయ విజేతగా రూ.15వేలు, మూడోవిజేతగా ఆత్మకూరు ఫుట్‌బాల్ క్లబ్ అనంతపురం వారికి రూ.7500 నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో బసిరెడ్డి దుర్గాప్రసాద్, వశిష్ఠ విద్యాపీఠ్ స్కూలు కరస్పాండెంట్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు. అనంతరం టగ్ ఆఫ్ వార్ పోటీలు నిర్వహించారు. ఇందులో విజేతలకు బహుమతులు అందించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నుజ్జు అయిన వ్యక్తి

జమ్మలమడుగు, జనవరి 16: పెద్దపసుపుల రోడ్డులో సోమవారం సాయంత్రం సుమారు 6.30 గంటలకు జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో వై.విశ్వనాథరెడ్డి (59) దుర్మరణం చెందాడు. పోలీసుల వివరాల మేరకు వివరాల్లోకెళితే... వై.విశ్వనాథరెడ్డి పెద్దముడియం మండలం పెద్దపసుపుల గ్రామస్థుడు. జమ్మలమడుగులో శనగల వ్యాపారం, రైతుగా వ్యవసాయం చేసి జీవనం సాగిస్తున్నాడు. సోమవారం సాయంత్రం వ్యాపార నిమిత్తం ద్విచక్ర వాహనంలో పట్టణానికి బయల్దేరాడు. పట్టణంలోకి ప్రవేశిస్తుండగా ఏపీ04.యు.బి.1342 సిమెంటు ట్యాంకర్ వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విశ్వనాథరెడ్డి ప్రధాన రోడ్డుపైనే నుజ్జు నుజ్జు అయ్యాడు. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో =పోలీసు అధికారులు ఘటనా స్థలానికివెళ్లి పరిశీలించాడు. మృతుడికి భార్య, ఒక కుమారుడు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. పోలీసులు ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని మృతుని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సంస్కృతీ సంప్రదాయాలను మరువరాదు

చాయాచిత్రమాలిక ఆవిష్కరణలో రామకృష్ణ మఠం ఇన్‌చార్జ్


చిత్రమాలికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడప (కల్చరల్), జనవరి 16: మన సంస్కృతీ, సంప్రదాయాలను మరువకుండా పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని రామకృష్ణ మఠం ఇన్‌చార్జ్ స్వామి సన్నివాసానంద పేర్కొన్నారు. జార్జి రూపొందించిన భృగు మహర్షి ఆస్థానం బుగ్గమల్లేశ్వరస్వామి దేవస్థానం చిత్రమాలికను మంగళవారం చెన్నూరు బస్టాండు వద్దగల రామకృష్ణమఠంలో ఆవిష్కరించిన ఆయన మాట్లాడుతూ నేటి పరిస్థితుల్లో సమాజం పట్ల గౌరవం, ఆచారాల పట్ల ఆసక్తి లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వ్యక్తి సన్మార్గంలో పయనించి ఇతరులకు మార్గదర్శకంగా నిలవాలని కోరారు. జిల్లా పర్యాటక రంగ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యదర్శి రామాంజులరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పలు ప్రాచీన పర్యాటక స్థలాలున్నాయని, వాటిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సాహితీవేత్త వెల్లాల వెంకటేశ్వరాచారి తదితలరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి ఇద్దరికి గాయాలు

చికిత్స పొందుతూ మరొకరు మృతి

కడప (క్రైం), జనవరి 16: కడప - క్రిష్ణాపురం రైల్వేస్టేషన్ వద్ద కడప - భాకరాపేట రైల్వే స్టేషన్ల మధ్య మంగళవారం రైళ్ల కింద పడి ఇద్దరికి గాయాలైనట్లు కడప రైల్వే పోలీసులు తెలిపారు. కడప వైఎస్ఆర్ కాలనీ వాసి జంగం క్రాంతి మంగళవారం రాత్రి ఇంటి నుంచి వచ్చి చౌటుపల్లె క్రాస్ వద్ద గూడ్సు రైలు కింద పడగా తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం తరలించినట్లు తెలిపారు. భాకరాపేట వద్ద ఓ యువకుడు రైలు కింద పడి తీవ్రగాయాలపాలయ్యాడని చికిత్స నిమత్తం అతన్ని ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. ఆదివారం రాయచోటి రోడ్డులోని రైల్వేగేటు వద్ద రైలు కింద పడి గాయపడిన షేక్ ఖాదర్ (32) తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. ఈమేరకు పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


ఏసీసీ బాధితులకు న్యాయం చేస్తాం

గొల్లపల్లిలో ఓళిగలు పంపిణీ చేసిన భూపేశ్‌రెడ్డి


బాధితుల నుంచి వినతిపత్రం తీసుకుంటున్న భూపేశ్‌రెడ్డి

మైలవరం, జనవరి 16: 'వైసీపీ అధికారంలోకి రాగానే ఏసీసీ పరిశ్రమ నిర్మిస్తామని ఏసీసీ భూ బాధితులకు మాయ మాటలు చెప్పి ఓళిగలు పంపిణీ చేసి ఓట్లు వేయించుకుని గెలిచిన ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నాలుగున్నరేళ్లు దాటినా పట్టించుకోకుండా ఏసీసీ బాధితులకు మోసం చేశారని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని గొల్లపల్లిలో ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఓళిగలు పంపిణీ చేసి అన్యాయం చేశారని చెబుతూ అందుకు నిరసనగా భూపేశ్‌రెడ్డి ఓళిగలను పంపిణీ చేశారు. ఏసీసీ భూ బాధితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1996 నుంచి ఏసీసీ పరిశ్రమ ఏర్పాటు చేయకపోవడంతో గొల్లపల్లి, వద్దిరాల, బెస్తవేముల, చిన్నవెంతుర్ల, బి.జంగాలపల్లి, కల్లుట్ల, రేగడిపల్లి తదితర గ్రామాల రైతులు ఇబ్బందులు పడుతున్నారని మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి టీడీపీ ప్రభుత్వంలో ఏసీసీ బాధితులను అమరావతికి తీసుకెళ్లి అప్పటి సీఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారని గుర్తుచేశారు. అంతలోనే ఎన్నికలు రావడం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి చేపట్టిందన్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అధికారంలోకి రాగానే ఏసీసీ పరిశ్రమ నిర్మిస్తామని అబద్ధాలు చెప్పడం, జిల్లాలో సీఎం జగన్ ఎన్నో సార్లు పర్యటించినా కనీసం ఒక్కసారైనా ఏసీసీ భూ బాధిత రైతుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకుపోకుండా కనీసం వినతి పత్రం కూడా ఇవ్వలేదంటే ఎమ్మెల్యే పరిస్థితి అర్థమవుతుందన్నారు. సీఎం వద్దకు వెళ్లేందుకు ఎమ్మెల్యేకే అపాయిమెంట్ లేక ఇబ్బంది పడుతుంటే ఏసీసీ బాధిత రైతుల సమస్యలను ఎలా పరిష్కరిస్తారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏసీసీ బాధితులకు న్యాయం చేస్తామన్నారు. పరిశ్రమలు తేవడంతో చంద్రబాబును మించినవారు లేరని నియోజకవర్గంలో సోలార్, ఏసీసీ పరిశ్రమలు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ నరసింహులు, నేతలు కొండయ్య, పాపిరెడ్డి, సూర్యపెద్దిరాజు, గంగరాజు, రాజారెడ్డి, తులసీరెడ్డి, బూసిరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా కోదండరాముని పార్వేట


పార్వేటి మండపంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ఒంటిమిట్ట, జనవరి16: వైభవంగా కోదండరాముని పార్వేట ఉత్సవాన్ని టీటీడీ అర్చకులు, గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఏటా సంక్రాంతి కనుమ రోజున పార్వేట ఉత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం శాస్త్రోక్తంగా ఉత్సవ మూర్తులను రామాలయంలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవంగా కోదండరాం సమీప నాగేటి తిప్పపై పార్వేట ఉత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవమూర్తుల మధ్య పెద్దఎత్తున భక్తులు స్వామి వారిని మండపం పైనుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవంగా సీతారామలక్ష్మణులు భక్తులకు దర్శనమిచ్చారు. వీరికి గ్రామంలో మహిళలు భక్తులు పెద్దఎత్తున కాయాకర్పూరం సమర్పించి స్వామి వారిని దర్శించు కున్నారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి ఉత్సవాలు


బండలాగుతున్న ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు - ప్రత్యేక అలంకరణలో శివుడు, పార్వతీదేవి

చాపాడు, జనవరి 16: వెదురూరు, రాజుపాళెం, నరహరిపురం గ్రామాల్లో 14న ఆదివారం నుంచి మూడు రోజులపాటు సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. వెదురూరు సంగమేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న దేవతామూర్తులు అయిన శివుడు, పార్వతీదేవిలకు పలు రకాల పూలతో ప్రత్యేక అలంకరణ చేశారు. గణపతి పూజ, కుంకుమార్చన, పాలాభిషేకం, హోమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దైవదర్శనం చేసుకున్నారు. మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎంపీపీ లక్షుమయ్య మంగళవారం దైవదర్శనం చేసుకున్నారు. చెక్కభజన, కోలాటం, పాటకచేరి నిర్వహించారు. మంగళవారం వెదురూరు, నరహరిపురం గ్రామాల్లో రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఇందులో నంద్యాల జిల్లా డోన్ మండలం వాసి ధర్మవరం సుబ్బారెడ్డి ఎద్దులు 2,562 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116 గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వల్లూరు మండలం బాలుగారిపల్లె వాసి ఇందిరెడ్డి రమణారెడ్డి ఎద్దులు 2001 అడుగు లాగి రెండో బహుమతి రూ.70,116, అనంతపురం జిల్లా చెర్లోపల్లె గ్రామానికి చెందిన శివరామిరెడ్డి ఎద్దులు 1766 అడుగులు లాగి మూడో బహుమతి రూ.50,116 గెలుచుకున్నట్లు వారు తెలిపారు. వెదురూరులో నిర్వహించిన పోటీల్లో ప్రొద్దుటూరు టౌన్ వైఎంఆర్ కాలనీకి చెందిన ద్వార్ల గురివిరెడ్డి ఎద్దులు 2,164 అడుగులు లాగి మొదటి బహుమతి రూ.1,00,116, నంద్యాల జిల్లా గడివేముల మండలం చక్రవాయిలి వాసి సయ్యద్‌బాష కలాం ఎద్దులు 1603 అడుగులు లాగి రెండో బహుమతి రూ.70,116, మిడుమాను మండలం గుడిపాడు గ్రామానికి చెందిన కొప్పుల తిమ్మారెడ్డి ఎద్దులు 1130 అడుగులు లాగి మూడో బహుమతి రూ.50,116 గెలుచుకున్నాయి.

గుర్తు తెలియని శవం లభ్యం

సికెదిన్నె, జనవరి 16: గుర్తు తెలియని పురుషుడి శవాన్ని కనుగొన్నట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు. ఆయన అందించిన వివరాల మేరకు కడప - రాయచోటి జాతీయ రహదారిపై బుగ్గలేటిపల్లె సమీప ఏఎల్ కాలనీ వద్ద కంపచెట్లలో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు అందించిన సమాచారం మేరకు అక్కడకు వెళ్లి చూడగా దాదాపు 60 ఏళ్లున్న వ్యక్తి శవాన్ని కనుగొన్నామన్నారు. దాదాపు వారం కిందటే మరణించి ఉండవచ్చని తెలుస్తోంది. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి వీఆర్వో రవిశంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

33 మద్యం బాటిళ్లు స్వాధీనం - ఒకరి అరెస్టు

సిద్దవటం, జనవరి16: భాకరాపేట వద్ద అక్రమంగా బత్తల చెంగయ్య నుంచి 33 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పెద్దఓబన్న తెలియజేశారు. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ తెల్లవారుజామున ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్‌పెక్టర్ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా రైల్వేకోడూరుకు చెందిన బత్తల చంగయ్య వద్ద 24 బీరు సీసాలు, 750 ఎంఎల్ 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలియజేశారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : యూటీఎఫ్


అంగన్వాడీలకు మద్దతు తెలుపుతున్న యూటీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జనవరి 16: ఎండనక, వాననక రోడ్డెక్కి, న్యాయబద్ధమైన సమస్యలు పరిష్కరించాలంటూ 35 రోజులుగా సమ్మె బాట పట్టిన అంగన్వాడీల పట్ల ప్రభుత్వం నియంతృత్వ పోకడ ప్రదర్శిస్తోందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు తీవ్రంగా ఖండించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట జరుగుతున్న అంగన్వాడీల సమ్మెకు సంఘీభావం తెలిపిన వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అంగన్వాడీ అక్కా చెల్లెల సమస్యలు అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని తెలంగాణ కంటే వెయ్యి అదనంగా జీతం ఇస్తామని అనేక హామీలను గుప్పించిన సీఎం ఇప్పటికీ ఇచ్చిన హామీలు అమలు చేయమని కోరుతూ సమ్మె బాట పట్టిన వారితో చర్చల పేరుతో కాలయాపన చేస్తూ వారి సమస్యలు పరిష్కరించకపోవడం పట్ల ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నిరూపితమైందన్నారు. అంగన్వాడీ టీచర్లు, కార్యకర్తలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు గ్రామీణ ప్రాంతాల్లోని అట్టడుగు ప్రజానీకానికి చేరవేస్తూ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా సేవలు చేస్తున్న వారిని గుర్తించకపోవడం ప్రభుత్వానికి తగదన్నారు. పండుగ రోజు కూడా పస్తులు ఉంటూ సమ్మె కొనసాగిస్తున్న వారి పట్ల ప్రభుత్వానికి కనీసం మానవత్వం లేకుండా పోవడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. యూటీఎఫ్ నేతలు రవికుమార్, నరసింహారావు, రమణ, ప్రభాకర్, మజ్జారి చెన్నకేశవులు, బత్తుల చంద్రశేఖర్, కిరణ్‌కుమార్, జి.వెంకటసుబ్బయ్య, పాల్గొన్నారు.

పెన్నాతీరం పార్వేట సంబరం

ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు


పెన్నాతీరంలో పోటెత్తిన ప్రజలు

చెన్నూరు, జనవరి 16: పెన్నాతీరం సంక్రాతి సంబ రంలో భాగంగా పార్వేట ఉత్సవంలో భక్తులు పోటెత్తారు. చెన్నూరులో ఉమామహేశ్వరులకు ప్రత్యేక పూజలు చేసి ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. తెలుగువారి సాంప్రదాయానికి అచ్చమైన ముచ్చటైన పండుగ. మూడురోజుల పండుగలో ప్రజ లు ఎంతో సంతోషాలతో ఉంటారని ఇలాంటి సంతోషాలు వారి జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయేలా ఉండాలని దేవున్ని కోరుకుంటుంటారు. ఏటా పార్వేట ఉత్సవం పెన్నాతీరంలో ఎంతో అంగరంగ వైభవంగా జరుగుతుందని ఈఉత్సవానికి తన అత్తగారి ఊరైన చెన్నూరు మండలం నుంచి ఏటా ఆహ్వానం వస్తుందని మామూలుగా తాను ఊరికి వస్తున్నా సంప్రదాయమైన ఈ పండుగకు రావడం తనకు ఎంతో సంతోషం ఇస్తుందని టీడీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి అన్నారు. పాతమిత్రులను, టీడీపీ నేతలు, కార్యకర్తలను చిన్నతనంలో తనతో పాటు చదువుకున్న మిత్రులను కలుసుకోవడం తనకు మరింత సంతోషం ఇస్తుందన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం

కనుమ పండుగ నాడు పెన్నాతీరంలో పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. కొండపేటలో మధ్యాహ్నం నుంచి ఉమమహేశ్వర ఉత్సవమూర్తులను ఊరేగించి అనంతరం పెన్నాతీరానిక తీసుకువచ్చారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల ప్రజలు ఈ ఉత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు ప్రకటించుకున్నారు. ఎంతో విశిష్టమైన ఈ పండుగ కొత్త అల్లుళ్లు, కొత్త కోడళ్లు, దూర ప్రాంత బంధువులు అందరూ పెన్నాతీరానికి తరలిరావడంతో కొత్త కళ సంతరించుకుంది. పెన్నాతీరమంతా జనసంద్ర మైంది. చిన్నారుల గాలిపటాలు ఎగురవేత, పెద్దల కబడ్డీ, ఇస్కాన్ వారి భజనలు, రకరకాల ఆటల పోటీలు వయో తేడాలేకుండా మధ్యాహ్నం నుంచి రా త్రి వరకు సందడిగా జరిపారు. మండ ల కన్వీనరు కెవి జయభాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శివారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ రామకోటిరెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి మల్లికార్జునరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుల చలపతి, క్లస్టర్ ఇన్‌చార్జ్ బుజ్జన్న, మాజీ సర్పంచులు మోహన్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ముండ్ల శ్రీనివాసులరెడ్డి, చెన్నూరు కార్యదర్శి పాలగిరి సుదర్శన్‌రెడ్డి టీడీపీ నేతలు లేవాకు ప్రతాప్‌రెడ్డి, ఓబిలి విజయభాస్కర్‌రెడ్డి, రామచంద్రరెడ్డి, తెలుగుయువత జిల్లా కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్లు సీజ్

ఒకరి అరెస్టు - కారు సీజ్

కొండాపురం, జనవరి 16: రెండు వేర్వేరు ప్రాంతాల్లో 12 మద్యం బాటిళ్లను సీజ్ చేసి అకరిని అరెస్టు చేసి, కారును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

గండికోట నుంచి బ్రహ్మసముద్రానికి శివకుమార్ కారులో మద్యం బాటిళ్లను తీసుకెళుతున్నాడు. కొండాపురం మండలం ముచ్చుమర్రి ఆర్చి వద్ద తనిఖీ చేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కారు సీజ్ చేశామని కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన విలేకరులకు తెలిపారు.

మద్యం విక్రయిస్తుండగా...

కడప (క్రైం), జనవరి 16: అక్రమంగా మద్యం అమ్ముతున్న చలమారెడ్డిపల్లె వాసి రోహిత్‌ను అదుపులోకి తీసుకుని ఎనిమిది మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కడప నగర శివార్లలోని రిమ్స్ పీఎస్ పరిధిలో మంగళవారం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ రామచంద్ర తమ సిబ్బందితో కలిసి అరెస్టు చేశారు.

అయోధ్యకు ఆహ్వానం


ఆహ్వాన పత్రిక అందిస్తున్న అయోధ్య ప్రతినిధులు

బ్రహ్మంగారిమఠం, జనవరి 16: అయోధ్య విగ్రహ ప్రాణ ప్రతిష్ఠకు అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామికి ప్రతినిధులు ఆహ్వాన పత్రిక అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా రావాలని కోరినట్లు నిర్వాహకులు తెలిపారు.

అనారోగ్యంతో సర్పంచ్ మృతి



బ్రహ్మంగారిమఠం, జనవరి 16: సోమిరెడ్డిపల్లె సర్పంచ్ సోమిరెడ్డిపల్లె రామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆర్మీలో దేశ సేవలో తరించిన రామయ్య ఉద్యోగ విరమణ తర్వాత రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్‌గా గెలుపొంది ప్రజల ఆదరాభిమానాలు పొందాడు. ప్రజలకందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు తీరుస్తూ అంతో ఇంతో సహాయం అందించేవారు. మంగళవారం ఉదయం అనారోగ్యంతో బెంగుళూరులో మృతి చెందినట్లు కుటుంబీకులు తెలిపారు. ఆయన మృతితో తోటి స్నేహితులు, సర్పంచులు, అధికారులు, దళిత సంఘాల నేతలు ఒక్కసారిగా శోకసంద్రంలో మునిగిపోయారు.

దేనేపల్లిలో ఘర్షణ - ఒకరు మృతి


చిన్నబాలయ్య మృతదేహం

ముద్దనూరు జనవరి16: దేనేపల్లిలో సోమవారం జరిగిన ఘర్షణలో కొలిమి చిన్నబాలయ్య (35) మృతి చెందినట్లు సీఐ ఈశ్వరయ్య తెలిపారు. సీఐ సమాచారం మేరకు వివరాలు... చిన్నబాలయ్య అదే గ్రామానికి చెందిన పుల్లయ్య సాయంత్రం గ్రామ సమీప గుడి వద్ద మద్యం మత్తులో గొడవ పడ్డారు. పుల్లయ్య చిన్నబాలయ్యపై టెంకాయలు వలిచే కడ్డీతో దాడి చేయగా ఛాతిపై గుచ్చుకోవడంతో తీవ్రగాయమైంది. వెంటనే చికిత్స నిమిత్తం జమ్మలమడుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. ఈ దాడిలో పుల్లయ్య మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఒంటిమిట్ట, జనవరి16: ఒంటిమిట్టలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన స్థానిక కోదండరామాలయం వెనుక భాగంగా చోటు చేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు విచారణ చేపట్టారు. గుర్తు తెలియని వ్యక్తిగా గుర్తించారని, సుమారు 50 ఏళ్లు పైబడి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్ఐ మధుసూదన్‌రావు తెలిపారు.

సంబరంగా సంక్రాంతి

రాయచోటి టౌన్, జనవరి 16 : రాయచోటి పట్టణంతో పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం కనుమ పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లె, గాలివీడు రోడ్డు, పాత రాయచోటి, మాసాపేటలతో పాటు రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం, నక్కావాండ్లపల్లె, కుమ్మరపల్లె, శిబ్యాల, గొర్లముదివీడు, మండపల్లి, మాధవరం, వరిగపాపిరెడ్డిగారిపల్లె తదితర ప్రాంతాల్లో రంగురంగుల బెలూన్లతో పశువులను అలంకరించి చిట్లాకుప్పలు వేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. చిట్లాకుప్ప వద్ద ఏపీఐఐసీ డైరెక్టర్ శ్రీనివాసులరెడ్డి సర్పంచ్ మమత, జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరెడ్డిల ఆధ్వర్యంలో చాందినీబండ్లు కట్టారు. ఉత్సవాలను తిలకించేందుకు గ్రామాల ప్రజలతో పాటు రాయచోటి నుంచి ముస్లింలు పెద్దఎత్తున హాజరయ్యారు. యండపల్లె వద్ద మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో చాందినీబండి కట్టి పెద్దఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

చిట్వేలి: మండలంలోని గ్రామాల్లో గొబ్బెమ్మ ప్రతిమ ఏర్పాటు చేసి కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిల్లావాండ్లపల్లె లో ఉప్పుతో సీతారాముల చిత్రం ఆకట్టుకుంది. మంగళవారం కనుమ పండుగ సందర్భంగా పాడి పశువులకు ప్రత్యేకంగా ముస్తాబు చేసి పూజలు చేశారు. ఎం.రాచపల్లెలో చిట్లకుప్పను వెలిగించి పశువులను తిప్పారు.

రామాపురం: రైతులు తమ పశువులను రంగులతో అలంకరించి గ్రామ శివార్లలో చిట్లా కుప్పలు వేసి పశువులను బెదిరించారు. దీనిని చూడడానికి ఆ గ్రామ ప్రజలు తరలి వచ్చారు.

గాలివీడు: కమలామారి, సాగూరివాండ్లపల్లి, బురుజుపల్లి, కొప్పల వాండ్లపల్లి, పశువులవాండ్లపల్లెల్లో ఎద్దులను అలకరించి సమీపంలోని చిట్లాకుప్పల దగ్గరకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. చిట్లకుప్పకు నిప్పు పెట్టి ఎద్దులకు బెదిరించారు.

రైల్వేకోడూరు(రూరల్): గ్రామీణ ప్రాంతాలలో రైతులు ప్రజలు పశువులను పూజించి ఎడ్ల బండ్లను ఊరేగించారు. రైల్వేకోడూరు పట్టణంలో ప్రధాన దారిలో కనుమ భోగి వేశారు. కోదండ రామాలయ ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

చిన్నమండ్యం: కనుమ పండుగ సందర్భంగా కాటమరాయుడికి పూజలు నిర్వహించారు. ఎద్దులకు బెలూన్లు, వాటి కొమ్ములకు అత్తిరసాలు, నగదు కట్టి ప్రత్యేకంగా అలకరించి ఊరేగించగా వాటిని లాక్కునేందుకు యువకులు పోటీ పడ్డారు. బలిజపల్లి రాధాకృష్ణ స్వామి కాటంరాజుకు పూజలు చేసిన తరవాత చిట్లాకుప్పకు అగ్గి పెట్టి, పశువులను తిప్పారు.

నందలూరు: మండలంలోని చెయ్యేరులో మంగళవారం సాయంత్రం కుమ్మరపల్లె, ఇసుకపల్లె, రాచపల్లె గ్రామాల ప్రజల ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఇసుకలో జోడెద్దుల బండ్ల పోటీలలో గెలుపొందిన అరవపల్లెకి చెందిన మసా



రామాపురంలో రైతులు వేసిన చిట్లాకుప్ప

న్‌కు సోఫా సెట్, నందలూరుకు చెందిన హరికి మిక్సీని, కుమ్మరపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డికి గ్యాస్ స్టవ్, సుబ్బరాయుడు, బాబుకు సంయుక్తంగా బకెట్‌సెట్, డైనింగ్ టేబుల్‌ను ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అందజేశారు. అనంతరం డ్యాన్స్ బేబీ డ్యాన్స్ కార్యక్రమాన్ని నిర్వహించి గుండు మల్లికార్జునరెడ్డి, గుండు సుదర్శన్‌రెడ్డి బహుమతులు అందజేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గొబ్బిళ్ల త్రినాథ్, నాయకులు గడికోట వెంకటసుబ్బారెడ్డి, అరిగె మని, గీతాల నరసింహారెడ్డి, అరిగెల సౌమిత్రి చంద్రబాబు, ఇబ్బు, మధు రాజు, బాపనపల్లె రామకృష్ణ, మున్నా, అవినాష్‌రెడ్డి పెద్దఎత్తున మహిళలు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి ఆధ్వర్యంలో ఆకేపాటి ఎస్టేట్ ఆవరణంలో తాడులాగు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. పేదలకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఆకేపాటి అనిల్‌కుమార్, ఆకేపాటి సాయిభరత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.




రైల్వే కోడూరు: కనుమ సందర్భంగా ఊరేగుతున్న కోదండ రాముడు



చిన్నమండ్యం: చిట్లాకుప్ప వద్ద ఎద్దులను ఊరేగిస్తున్న రైతులు



రాయచోటిలో చిట్లాకుప్ప వద్ద చేరిన రైతులు, ప్రజలు



చిట్వేలి:ఉప్పుతో వేసిన సీతారాముల చిత్రం



గాలివీడు: ఎద్దులను తీసుకెళుతున్న రైతులు

సాతుపల్లెలో అన్నదానం



భోజనం చేస్తున్న ప్రజలు

రాజంపేట టౌన్, జనవరి 16 : రాజంపేట పట్టణం సాతుపల్లెలో గొబ్బెమ్మ నిమజ్జనం సందర్భంగా టీడీపీ నియోజకవర్గ నాయకుడు మేడా విజయశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాతుపల్లె గ్రామంలోని మహిళలు, యువకులు, పెద్దలు, చిన్నారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్తపల్లెలో ఎద్దుల పోటీలు



ఎద్దులపోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

ఒంటిమిట్ట, జనవరి16 : మండల పరిధిలోని చిన్న కొత్తపల్లె గ్రామంలో కనుమ పురస్కరించుకొని రైతులు మంగళవారం ఎద్దుల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన ఎద్దుల యజమానులకు బహుమతులను అందజేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

నారా లోకేష్‌ను కలిసిన తౌహీర్‌ఖాన్



నారా లోకేష్‌ను కలిసిన తౌహీర్‌ఖాన్

చిన్నమండ్యం, జనవరి 16: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను నారావారిపల్లెలో చిన్న మం డ్యం మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహీర్ ఖాన్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. టీడీపీ గెలుపు కోసం సమష్టిగా పని చేయాలని సూచించి నట్లు తెలిపారు. ఎన్నికల కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని ఎపుడు ఎన్నికలు వచ్చినా ఈ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

మాంసం పంపిణీ

సిద్దవటం, జనవరి 16: మండలంలోని రాజంపేట ఎస్సీ కాలనీలో కనుమ పండుగ సందర్భంగా 200 కుటుంబాలకు జనసేన పార్టీనే అతికారి కృష్ణ మాంసం పంపిణీ చేశారని ఆ పార్టీ నాయకులు మస్తాన్‌బాబు, నాగార్జున, రవితేజ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పేదవాడు కనుమ పండుగనాడు సంతోషంగా ఉండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు

పండుగ నాడూ.. కొనసాగిన అంగన్‌వాడీ దీక్షలు

రాజంపేట టౌన్, జనవరి 16: సంక్రాంతి రోజు రాజంపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన కొనసాగించారు. ఆందోళన 36వ రోజుకు చేరుకున్న సందర్భంగా మంగళవారం గాలిపటాలు ఎగురవేసి ప్రభుత్వ మొండి వైఖరి నిరసిస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వం ఇలాగే వ్యవహరిస్తే తమ ఆందోళనలు తీవ్రం చేస్తామని అందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు విజయ, జ్యోత్స్న, గౌసియా, సుమతి, శివ తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు(రూరల్): రాష్ట్ర ప్రభుత్వం తన మొండి వైఖరి మానుకోవాలని అంగన్వాడీ సంఘం అధ్యక్షురాలు రమాదేవి డిమాండ్ చేశారు. అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహిస్తున్న సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు లీలా, దుర్గా, శిరీష, పద్మ తదితరులు పాల్గొన్నారు.



రాజంపేట: ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు



రైల్వేకోడూరు: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

గంటా ఆధ్వర్యంలో ఉచితంగా సినిమా ప్రదర్శన

రాజంపేట, జనవరి 16 : సంక్రాంతి పండుగ సందర్భంగా టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో పట్టణంలోని అన్ని సినిమా హాళ్లలో సోమవారం ఉచితంగా సినిమాలు ప్రదర్శించారు. పట్టణంలోని నాలుగు సినిమా హాళ్లండగా ఒక్కో దానిలో నాలుగు షోస్ చొప్పున 16 షోల్లో సైంధవ్, హనుమాన్, నా సామిరంగ, గుంటూరుకారం సినిమాలను ప్రదర్శించారు. పెద్దఎత్తున ప్రచారం నిర్వహించడంతో సోమవారం తెల్లవారుజాము నుంచే ఆయా సినిమా హాళ్ల వద్దకు భారీ ఎత్తున జనం క్యూ కట్టారు. ఒక్క సారిగా వేలాది జనం తరలి రావడంతో సినిమా హాళ్ల వద్ద తోపులాట చోటుచేసుకుంది. హాళ్ల కెపాసిటీకి తగ్గట్టు సుమారు 8 వేల టికెట్లు కేటాయించగా, అందుకు పదిరెట్ల మంది సినిమా హాళ్ల వద్దకు చేరుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు ఉదయం నుంచి రాత్రి వరకు బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రేక్షకులను కలవడానికి సాయి సినిమాస్ థియేటర్ వద్దకు చేరుకున్న గంటా నరహరిని అభిమానులు, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు డప్పులు వాయిస్తూ, బాణసంచా కాలుస్తూ స్వాగతం పలికి ఆయన కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో రాజంపేట మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్యానాయుడు, ఒంటిమిట్ట టీడీపీ నాయకులు బొబ్బిలి రాయుడు, సిద్దవటం టీడీపీ నాయకులు నాగమునిరెడ్డి, ఆర్యవైశ్య సంఘ నాయకులు సునీల్ తదితరులు పాల్గొన్నారు.



సినిమా హాళ్ల వద్ద గంటా నరహరికి స్వాగతం పలుకుతున్న అభిమానులు

యువత అన్ని రంగాల్లో రాణించాలి

● టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్ బాబు

రాయచోటి టౌన్, జనవరి 16: యువత చదువు, క్రీడలే కాకుండా అన్ని రంగాల్లో రాణించాలని టీటీడీ పాలకమండలి మాజీ సభ్యుడు రాయచోటి టీడీపీ నేత సుగవాసి ప్రసాద్ బాబు అన్నారు. రాయచోటి మండలం శిబ్యాల గ్రామంలో టీడీపీ నేత అనుంపల్లె రాంప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నీని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని రంగాలతోపాటు క్రీడారంగంలో కూడా రాణిం చాలన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అనంతరం రాంప్రసాద్ రెడ్డి శిబ్యాల గ్రామ ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం ద్వారా యువతలో క్రీడా స్ఫూర్తి పెరగడమే కాకుండా స్నేహభావం ఏర్పడుతుందన్నారు. క్రీడాకారులు స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ టోర్నీలో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెమ్మాడపల్లె సర్పంచ్ పల్లపు వాసు, నారాయణ రెడ్డి, గంగిరెడ్డి, భాస్కర, ఈశ్వర్ రెడ్డి, రెడ్డయ్యతదితరులు పాల్గొన్నారు. దిగువ అబ్బవరం గ్రామం ఇందుకూరుపల్లెలో సంక్రాంతి సందర్భంగా ఇందుకూరుపల్లె క్రికెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నీ పోటీలలో ఫైనల్ మ్యాచ్ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విన్నర్స్ అంజి టీమ్‌కు రూ.20 వేలు, రన్నర్స్ నక్కవాండ్లపల్లె టీమ్‌కు రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో దిగువ అబ్బవరం నాయకులు రవీంద్ర నాయుడు, బాలకృష్ణ నాయుడు, సుబ్బయ్య నాయుడు, ఆంజనేయులు నాయుడు, మేస్త్రీ రమణ, అంజి, సురేశ్, బాలాజీ, గుర్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న ప్రసాద్ బాబు

పండగ చేసుకునే అర్హత ప్రభుత్వానికి లేదు



సమావేశంలో పాల్గొన్న బీకేఎంయూ నాయకులు.

రైల్వేకోడూరు(రూరల్) జనవరి 16: పశువుల పండగ చేసుకునే అర్హత వైసీపీ ప్రభుత్వానికి లేదని బీకేఎంయూ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పందు గోల మణి విమర్శించారు. మంగళ వారం పట్టణంలోని సీపీఐ కార్యాల యంలో జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప సమక్షంలో సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీఅధికారంలోకి రాగానే భూ పెత్తందారులు, బడా నాయకులు రెవెన్యూ అధికారుల అండదండలతో రాష్ట్ర వ్యాప్తంగా బంజరు భూములు, జెడ్‌హెచ్ డీసీ భూములు, దేవాదాయ, ధర్మదాయ, గ్రామ కంఠం, చెరువులు, కుంటలు చివరికి పశువుల మేత పోరంబోకు భూములను అక్రమించుకున్నారని ఆరోపించారు. పశువులకు కడుపునిండా దాణా అందించలేని ప్రభుత్వం పండగ చేసుకునే అర్హత కోల్పోయిందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా పశువులకు దాణా ఏర్పాటు చేసి అక్రమించుకున్న మేత భూములు వేంటనే స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు చల్లంపాటి నరసింహులు, కోడూరు అధ్యక్షులు రేవూరి శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

పార్వేట ఉత్సవం

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 16 : రామేశ్వరంలోని ముక్తిరామలింగేశ్వరస్వామి పార్వేట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం గంగా కాశీ అన్నపూర్ణేశ్వరదేవి సమేత హనుమత్ లింగేశ్వరస్వామి, గంగా రాజరాజేశ్వరిదేవి సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి పెన్నానది ఒడ్డున ఉత్సవం నిర్వహించారు. అనంతరం రామేశ్వరంలో గ్రామోత్సవం నిర్వహించారు. బొల్లవరంలోని శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం వెనుక ఉన్న మైదానంలో పార్వేట ఉత్సవం నిర్వహించారు.

చీరలు పంపిణీ

పుల్లంపేట, జనవరి 16: ఎంపీపీ ముద్దా బాబుల్‌రెడ్డి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం డాక్టర్ రామసుబ్బారెడ్డి, కొల్లం యశ్‌పాల్‌రెడ్డి మంగళవారం మండలంలోని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, సుదర్శన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

ఘనంగా గుండు గంగమ్మ జాతర

రామాపురం, జనవరి 16: మండలంలోని గోపగుడిపల్లె కస్పాలో మంగళవారం గుండు గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కు బడులు తీర్చుకున్నారు. అనంతరం మొక్కుబడి ఉన్నవారు అమ్మవారికి బోనాలు పెట్టారు. రాత్రిజ సాంస్కృతిక కార్యక్రమాలు కోలాటాలు, చెక్కభజన లు, హరికథలు నిర్వహించారు. అమ్మవారికి మొక్కు బడి ఉన్న వారు కట్టిన చాందినీ బండ్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. పందోళ్లపల్లె బలరామయ్య కార్యక్రమాలను పర్యవేక్షించారు.. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు, ప్రజలు, మహిళలు హాజరయ్యారు.



విద్యుత్ వెలుగుల్లో చాందినీబండి

నేడు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఒంటిమిట్ట, జనవరి 16 : మండల కేంద్రంలోని ఒంటిమిట్ట జిల్లా పరిషత్ హైస్కూలులో 1989-90 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సీపీఎం రమణ తెలిపారు. 35 ఏళ్ల క్రితం కలిసి చదువుకున్న విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువులను ఒకసారి వారిని స్మరించుకోవాలన్న ఉద్దేశంతో తనతో పాటు పాఠశాలకు సహాయ సహకారాలు అందించేందుకు ఆత్మీయ సమ్మేళన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు స్థానికులు తదితరులు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

అంబేడ్కర్ భవనం నిర్మించండి



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

రైల్వేకోడూరు(రూరల్) జనవరి 16: పట్టణంలోని తులసి కాంప్లెక్స్ ఎదురుగా ప్రధాన రహదారి వద్ద ఉన్న అంబేడ్కర్ భవన స్థలం నిరుపయోగంగా మారింది. కోడూరు ఎస్సీ నియోజకవర్గం కావడంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి, వర్ధంతి రోజుల్లో సమావేశాలు ఏర్పాటు చేసుకునేందుకు 62 ఏళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం ఈ స్థలాన్ని కేటాయించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆ స్థలంలో ఒక భవనాన్ని కట్టుకునే పరిస్థితి లేకపోవడం సిగ్గుచేటని జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు పుల్లెల రమేష్ ధ్వజమెత్తారు. మంగళవారం స్థలం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ప్రసుత్త కోడూరు ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు 15 ఏళ్ల ఎమ్మెల్యేగా ఉన్నా కనీసం ఆ స్థలం వైపు చూసిన పాపానపోలేదని విమర్శించారు. కనీసం ఇప్పటికైనా ఎమ్మెల్యే ఆ స్థలం మీద శ్రద్ధ చూపి భవన నిర్మాణ పనులు మొదలుపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ కార్యదర్శి తేనెపల్లి చిన్న, చంద్రమౌళి, మహర్షి, రాజేష్, సుధాకర్, గని, సాయి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన చిట్వేలి టీడీపీ నాయకులు



చంద్రబాబుతో మాట్లాడుతున్న లారీ సుబ్బరాయుడు

చిట్వేలి, జనవరి16 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడును సోమవారం కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు చిట్వేలి టీడీపీ నాయకులు లారీ సుబ్బరాయుడు, బాలు రామాంజనేయులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా నారావారిపల్లెలో ఆయనను కలిసినట్లు తెలిపారు.

రామాలయ నిర్మాణానికి సాయం



రామాలయ నిర్మాణానికి చెక్కు అందజేస్తున్న ముక్కా సాయి వికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, జనవరి 16 : మండలంలోని గాదెల వెంకటరామాపురంలో రామాలయ నిర్మాణానికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ ద్వారా రూ. 50వేల చెక్కును ముక్కా సాయి వికాస్‌రెడ్డి గ్రామస్తులకు అందజేశారు. గాదెల వెంకటాపురం సర్పంచ్ కాణిపాకం సుబ్బలక్షుమ్మ, సుబ్బయ్య, గోల్కొండ భాస్కర, చిన్నయ్య, సుబ్బరాయుడు, నంది మండలం ప్రసాద్, జన తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సహాయం



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ముక్కా వరలక్ష్మి

ఓబులవారిపల్లె, జనవరి 16: మండలంలోని పెద్దఓరంపాడు గ్రామ పంచాయతీ లింగిరెడ్డిపల్లెకు చెందిన ముద్దపోలు సుబ్రమణ్యం కుమారుడు ముద్దపోలు గణేష్ డిగ్రీ ప్రథమ సంవత్సరం ఫీజు 30 వేల రూపాయలను ముక్కా రూపానంద రెడ్డి సతీమణి ముక్కా వరలక్ష్మి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపద అన్న వారికి ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ సాయం చేస్తుందని తెలిపారు. ముక్కావారిపల్లె సర్పంచ్ అరవ శ్రీధర్, సాలవ రమణరాజు, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం.. వస్త్రదానం



వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, రంగారెడ్డి

రాజంపేట, జనవరి 16: సంక్రాంతి పండుగ సందర్భంగా ఆకేపాటి గోపాల్ రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ ఆకేపాటి శ్రీనివాసులురెడ్డి, రాజంపేట మండల ఉపాధ్యక్షుడు ఆకేపాటి రంగారెడ్డి మహిళలకు చీరలు, పురుషులకు పంచె, టవలు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు.

పేదలపాలిట అన్నపూర్ణ అన్న క్యాంటీన్



అన్న క్యాంటీన్‌లో నాగమునిరెడ్డి

రాజంపేట, జనవరి16 : సం క్రాంతి పండుగ రోజు అన్న క్యాం టీన్ ద్వారా టీడీపీ నేత గంటా నరహరి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించడం అభినందనీయమని టీడీపీ జిల్లా కార్యదర్శి నాగమునిరెడ్డి తెలిపారు. మంగళవారం అన్న క్యాంటీన్‌లో ఆయన భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనవరి 1వ తేదీన రాజంపేటలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ పేదల పాలిట అన్నపూర్ణగా మారిందన్నారు .గత టీడీపీ హయాంలో నంద మూరి తారక రామారావు పేరిట అన్న క్యాంటీన్ ఏర్పాటు చేసి పేదలకు అన్న ప్రసా దం అందిస్తుంటే దానిని జగన్ ప్రభుత్వం దుర్మార్గంగా మూసివేసి పేదకలు కడుప కొట్టిందన్నారు. త్వరలో తెలుగుదేశం ప్రభుత్వం రానుందని, ప్రభుత్వం ద్వారా వీటిని పునరుద్ధరిస్తుందన్నారు.

సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



కబడ్డీ విజేతలకు బహుమతులు అందజేస్తున్న యల్లటూరు శ్రీనివాసరాజు

నందలూరు, జనవరి16 : మన సంస్కృతి సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు యువత ముందుకు రావాలని రాజంపేట నియోజకవర్గ జనసేన నేత యల్లటూరు శ్రీనివాసరాజు పిలుపునిచ్చారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా జనసేన పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని అరవపల్లె క్రీడా మైదా నంలో కబడ్డీ పోటీలు, పాటూరు, కుమ్మరపల్లి గ్రామాలలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ యల్లటూరు శివరామరాజు, మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, మాజీ జిల్లా కో-ఆప్షన్ మెంబర్ షబ్బీర్, అహమ్మద్, యల్లటూరు ప్రతీమ్, ఎల్.శివశంకర్‌రాజు, శివరామరాజు, ఎం.శివశంకర్‌రాజు, ఆకుల చలపతి, పాటూరు సుబ్బరాయుడు, రమణ, గురివిగారి వాసు, తిప్పాయపల్లె ప్రశాంత్, భారతాల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ చేయించండి

రాయచోటి టౌన్, జనవరి 16: రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరణ చేసే ప్రక్రియను సత్వరం పూర్తి చేయించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి కె.ధనంజయరెడ్డిని ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, జిల్లా కో-కన్వీనర్ షేక్ ఖాదర్ బాషా కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వారు ఆయనతో మాట్లాడుతూ త్వరలో సార్వత్రిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ వచ్చి కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ప్రక్రియకు ఆటంకాలు ఏర్పడక ముందుగానే రెగ్యులర్ ఉద్యోగ నియామకపత్రాలు సత్వరం ఇచ్చేటట్లు ఉన్నతాధికారులను ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు.

సౌమ్యనాథుడి సన్నిధిలో మైన్స్‌అండ్ జియాలజీ డైరెక్టర్

నందలూరు, జనవరి16 : రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్ వి.జి.వెంకటరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం సౌమ్యనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, తీర్థప్రసాదాలు అందజేసి పూలమాల శాలువాతో సత్కరించారు.

అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ



అయోధ్య రాముడి అక్షింతలు పంపిణీ చేస్తున్న సూర్య నారాయణరెడ్డి

పెనగలూరు, జనవరి 16: మండలంలోని ఎగువ సిద్ధవరంలో మంగళవారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను రామాలయ ధర్మకర్త సూర్యనారాయణ రెడ్డి కుటుంబ సభ్యుల అధ్వర్యంలో భక్తులకు పంపిణీ చేశారు. అలాగే సూరే నారాయణరెడ్డి కుమారులు సూరే మల్లికార్జునరెడ్డి, సూరే శివకుమార్ రెడ్డి ఇంటింటికి వెళ్లి అక్షింతలతో పాటు అయోధ్యలో నిర్మించిన శ్రీరామాలయ చిత్రపటాలను కూడా భక్తులకు అందజేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సిద్ధవరం వెంకటేశ్వరరెడ్డి, గ్రామ పెద్దలు తుంటి నరసింహులు, చొప్పా వెంకటరెడ్డి, బరిగల చిన్నయ్య పాల్గొన్నారు.

తమిళ మందుబాబుల సందడి



బలిజకండ్రిగలోని ప్రభుత్వ మద్యం షాపువద్ద రద్దీ

కనుమ సందర్భంగా తమిళనాడులో మద్యం షాపులు మూసేయడంతో సరిహద్దుల్లోని పాలసముద్రం మండలం బలిజకండ్రిగ మద్యం షాపు మంగళవారం కిటకిటలాడింది. ఉదయం నుంచే రద్దీ పెరగడంతో మద్యం దుకాణాల ఎదుట పోలీసులు క్యూలైన్లను ఏర్పాటు చేశారు. రోజుకు లక్షా లక్షన్నర రూపాయల అమ్మకాలు జరిగే ఈ షాపులు అయిదారు లక్షల మద్యం హాట్‌కేకుల్లా అమ్ముడైపోయింది. నిజానికి తమిళనాడు కంటే ఇక్కడ మద్యం ధరలు ఎక్కువ. అయినా తమిళనాడు మందుబాబులు ఎగబడ్డారు.

- పాలసముద్రం

దొరికిన కోడి.. దొరికినట్లు..!

నెల్లూరు జిల్లాలో మినీ లారీ బోల్తా
నలుగురికి గాయాలు

కోళ్ల లారీ బోల్తాపడి, గాయపడి కొందరు బాధపడితే.. జనమేమో రోడ్డుపై పడిన కోళ్ల కోసం పరుగు తీశారు. దొరికింది దొరికినట్లు పట్టుకెళ్లి 'పండుగ' చేసుకున్నారు. ఈ ఘటన నెల్లూరు జిల్లా మనుబోలులో జరిగింది. వివరాలిలా ఉన్నాయి. చిత్తూరు జిల్లా పుంగనూరు నుంచి 1080 కోళ్లతో మినీలారీ నెల్లూరుకు బయలుదేరింది. మంగళవారం తెల్లవారుజామున మనుబోలు వంతెన వద్ద ఈ కోళ్లలారీని మరో లారీ అధిగమించి ముందుకు వచ్చి హఠాత్తుగా బ్రేక్ వేసింది. దీంతో కోళ్లలారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుజిత్, క్లీనర్ సందీప్‌తో పాటు మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కోళ్ల లారీ బోల్తా పడిందన్న విషయం తెలియగానే స్థానికులంతా హైవే పైకి చేరుకున్నారు. సందట్లో సడేమియా అంటూ చేతికి చిక్కినన్ని కోళ్లను పట్టుకెళ్లారు. కాగా, మిగిలిన కోళ్లను మరోలారీలో ఎక్కించి నెల్లూరుకు తరలించారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

- మనుబోలు


లారీ నుంచి కోళ్లు పట్టుకెళుతున్న స్థానికులు

ఇందుశేఖర్‌కు చంద్రబాబు ఆహ్వానం



చంద్రగిరి, జనవరి 16:టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుకు తిరుపతి విమానాశ్రయంలో టీడీపీ రాష్ట్ర నాయకుడు కొల్లూరు ఇందుశేఖర్ సాదర వీడ్కోలు పలికారు.సంక్రాంతి పండుగను జరుపుకునేందుకు కుటుంబసభ్యులతో కలిసి స్వగ్రామమైన నారావారిపల్లెకు వచ్చిన చంద్రబాబు మంగళవారం సాయంత్రం తిరుగుపయనమయ్యారు. ఈ సందర్భంగా తనను ఒకసారి విజయవాడకు వచ్చి కలవాల్సిందిగా చంద్రబాబు చెప్పారని ఇందుశేఖర్ తెలిపారు.

కన్నులపండువగా
పార్వేట ఉత్సవం



తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమలలో పార్వేటఉత్సవం కన్నులపండువగా జరిగింది.మంగళవారం మధ్యాహ్నం ఒంటిగంటకు మలయప్పస్వామి తిరుచ్చిలో పార్వేటమండపానికి వేంచేశారు. స్వామి వెంట మరో తిరుచ్చిపై శ్రీకృష్ణస్వామి కొలువుదీరారు.ఉభయదారులకు, తాళ్లపాక వంశీయులకు, మఠంవారికి మర్యాదలు చేశాక శ్రీకృష్ణస్వామిని సన్నిధి యాదవ పూజ చేసిన ప్రదేశానికి వేంచేపు చేసి పాలు, వెన్న, హారతులు సమర్పించారు.మలయప్పస్వామి సహా అర్చకులు ముందుకు కొంతదూరం పరుగెత్తి బడిసెను విసిరి వెనక్కు వచ్చారు. ఇలా మూడుసార్లు జరిగింది. మలయప్పస్వామి తిరిగి ఆలయ మహాద్వారం వద్దకు చేరుకుని హథీరాంజీ మఠంవారి బెత్తాన్ని తీసుకుని సన్నిధిలోకి వేంచేశారు.టీటీడీ ఛైర్మన్ కరుణాకర రెడ్డి, జేఈవో వీరబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లిన ఆమె ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. అనంతరం రంగనాయకమండపానికి చేరుకున్న ఆమెను వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.


తిరుమల ఆలయం వద్ద కుటుంబ సభ్యులతో జస్టిస్ జ్యోతిర్మయి

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే
ఏపీకి విభజన హామీలు అమలు
తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి):'రాష్ట్ర విభజన అనేది అనివార్యం. ఆనాడే ఏపీకి అవసరమైన ప్రత్యేక హోదా, ఇతర అభివృద్ధి అంశాలతో హామీలు ఇచ్చాం. ఆ దిశగానే అప్పటి ప్రధాని కూడా హామీ ఇచ్చారు. కానీ ఆనాడు ఉన్నవాళ్లు ఒప్పుకోలేదు. కేంద్రంలో, ఏపీలో మా పార్టీ అధికారంలోకి వస్తే ఏపీకి రావాల్సిన విభజన హామీలు అమలు చేస్తాం' అని తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. తెలంగాణాతో పాటు ఏపీ కూడా బాగుండాలనే విధంగా పనిచేస్తామన్నారు. కాంగ్రెస్‌పై ప్రజలకు ఉన్న వ్యతిరేక భావన తొలగిపోయిందన్నారు. విభజనతో పాటు అభివృద్ధి కూడా జరగాల్సి ఉన్నప్పటికీ జరగలేదన్నారు. ఇక, ఏపీలో ఎన్నికల అంశంపై మాట్లాడుతూ.. తాను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తనని, పార్టీ నిర్ణయం మేరకు ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ప్రచారం కోసం తిరిగానన్నారు. తప్పకుండా ఏపీలో కూడా కాంగ్రెస్‌కు అధికారం ఇవ్వమని ప్రజలను కోరుకుంటామన్నారు.కాంగ్రెస్‌కు కొత్త ఓట్లు వస్తాయా, లేక వైసీపీ, టీడీపీ ఓట్లు వస్తాయా అనేది భవిష్యత్తు నిర్ణయిస్తుందని ఓ ప్రశ్నకు బదులిచ్చారు.


తిరుమల ఆలయం వద్ద మంత్రి పొన్నం ప్రభాకర్

2 వరకు రహదారి భద్రతా మాసోత్సవాలు

చిత్తూరు సిటీ, జనవరి 16: ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 2వ తేది వరకు జాతీయరహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు డీటీసీ నిరంజన్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 'యువశక్తి ద్వారా సామాజిక మార్పు' నినాదంతో మాసోత్సవాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బస్సు, లారీ, ఆటో డ్రైవర్లకు, కళాశాల విద్యార్థులకు, ముఖ్యమైన కూడళ్లలో సమావేశాలు ఏర్పాటుచేసి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తామన్నారు.

బంగారుపాళ్యం మాజీ జమీందారు మృతి

బంగారుపాళ్యం, జనవరి 16: బంగారుపాళ్యంలో మంగళవారం ఉదయం మాజీ జమీందారు ఎంబీ సుబ్బరామరాజు (87) కన్నుమూశారు. ఈయన 1962 నుంచి 1988 వరకు బంగారుపాళ్యం మేజర్ పంచాయతీ సర్పంచిగా 25సంవత్సరాలు కొనసాగారు. బ్రిటీష్ కాలంలో టిర్కాకా డెవలప్‌మెంట్ కమిటీ బంగారుపాళ్యంకు చైర్మన్‌గా ఉన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి, ప్రభుత్వ పాఠశాల, మొగిలేశ్వర కల్యాణ మండపానికి స్థలదాత కూడా ఈయనే. మొగిలేశ్వరస్వామి ఆలయ వంశపారంపర్య ధర్మకర్తగా కూడా కొనసాగుతున్నారు. దొరచెరువు పునర్నిర్మాణానికి అప్పట్లోనే ఆర్థికసాయం అందించారు. చిత్తూరులోని బీజడ్ స్కూల్ కరస్పాండెంట్‌గా 1961 నుంచి కొనసాగుతున్నారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీలో డైరెక్టర్‌గానూ ఉన్నారు. ఈయనకు ఒక కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన పార్థివదేహానికి పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి మురళీమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, వైసీపీ రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ ఛైర్మన్ ఎం.బి.కుమార్‌రాజా, మండల వైసీపీ కన్వీనర్ రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, వైసీపీ నాయకులు విద్యారెడ్డి, కృపాసాగర్ రెడ్డి, నారే సోమశేఖర్, దత్తాత్రేయ రెడ్డి తదితరులు నివాళులర్పించారు. బుధవారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు ఎంబీ విజయకుమార్ తెలిపారు.


సుబ్బరామరాజు (ఫైల్‌ఫొటో)


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నలుగురు వేటగాళ్ల అరెస్టు
మూడు నాటు తుపాకులు స్వాధీనం

బంగారుపాళ్యం, జనవరి 16: అటవీ జంతువుల కోసం పేల్చిన నాటు తుపాకీ గుండు తగిలి ఓ వ్యక్తి మృతిచెందిన కేసులో పోలీసులు నలుగురు వేటగాళ్లను అరెస్టు చేశారు. వీరి నుంచి మూడు నాటు తుపాకీలు స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను పలమనేరు డీఎస్పీ సుధాకర్‌రెడ్డి సోమవారం మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. మేత కోసం వెళ్లిన ఎద్దు తిరిగి రాకపోవడంతో బంగారుపాళ్యం మండలం ఎగువ కంతలచెరువుకు చెందిన ఉమాపతి శుక్రవారం రాత్రి దానిని వెతుకుతూ వెళ్లారు. నాగాలపురం గ్రామ సమీపంలోని తూర్పు అటవీ ప్రాంతంలో ఎంత వెతికినా కనిపించకపోవడంతో ఇంటికి తిరుగు ప్రయాణమయ్యారు. అదే సమయంలో వన్యమృగాలను వేటాడుతున్న నాగరాజు.. చీకట్లో అలికిడి విని ఏదో అడవి జంతువని భావించి నాటు తుపాకీతో కాల్చారు. ఆ గుండు తగిలి ఉమాపతి మృతిచెందారు. మృతుడి అన్న శరత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు సోమవారం నాగాలపురం క్రాస్ వద్ద ఉన్న నాగరాజు (నాగాలపురం), ఎగువకంతల చెరువుకు చెందిన వెంకటేష్, పాండియన్, శేఖర్ (ఎగువకంతల చెరువు)ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి మూడు నాటు తుపాకులను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండుకు పంపామన్నారు. ఎవరైనా వన్యమృగాలను వేటాడినా, కరెంటు తీగలు లాగినా చట్టరీత్యా నేరమని తెలిపారు. గ్రామస్తులెవరైనా ఇలాంటి చర్యలకు పాల్పడితే స్థానిక పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ సమావేశంలో సీఐ నాగరాజరావు, ఏఎస్‌ఐ మల్లప్ప, సిబ్బంది ఉన్నారు.


నిందితులను అరెస్టు చూపుతున్న డీఎస్పీ సుధాకర్ రెడ్డి




కుప్పంలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు - పలమనేరులో నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు

కుప్పంలో కోటి సంతకాల వేడి

కుప్పం, జనవరి 16: కుప్పంలో అంగన్వాడీల ఉద్యమం తీవ్ర రూపం తీసుకుంటోంది. భోగి, సంక్రాంతి, కనుమ పర్వాలలో సైతం దీక్షలను కొనసాగించారు. సంక్రాంతి నాడు పట్టువిడవ కుండా దీక్షా శిబిరంలోనే గడిపిన అంగన్వాడీలు, కనుమ పండుగ రోజైన మంగళవారం కోటి సంత కాలను సేకరణకు నడుంబిగించారు. 'జగనన్నకు చెబుదాం' పేరుతో తమ డిమాండ్ల సాధనకు ప్రజల నుంచి మద్దతుగా సంతకాలు సేకరించారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐయూటీ నాయకురాలు లలిత ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ని అణచివేత చర్యలకు ప్రభుత్వం పాల్పడినా సమస్యలు పరిష్కరించేవరకు పోరాటం ఆపేదిలేదని స్పష్టం చేశారు.

పలమనేరు: సీఎం జగన్ నియంతలా వ్యవహరిస్తున్నారని అంగన్వాడీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం పలమనేరులో అంగన్వాడీలు ఆందోళన కొనసాగించారు. సమస్యలు పరిష్కరించకుంటే వచ్చే ఎన్నికల్లో మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఓబుల్‌రాజు, గిరిధరమూర్తి, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు రాధ, ఆయాలు పాల్గొన్నారు.

వైభవంగా కైలాసగిరి ప్రదక్షిణ

- వివాహ వేడుకకు దేవగణాలను ఆహ్వానించిన పార్వతీ పరమేశ్వరులు

శ్రీకాళహస్తి జనవరి 16 : శ్రీకాళహస్తిలో కైలాసగిరి ప్రదక్షిణ సంబరం అంబరాన్ని తాకింది.తమ కళ్యాణ మహోత్సవానికి దేవగణాలను శివపార్వతులు ఆహ్వానించే వేడుకకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహాశివరాత్రి ఉత్సవాల్లో శివపార్వతుల కల్యాణ వేడుక వైభవంగా జరుగుతుంది.ఈ వేడుకకు రావాలంటూ పరమశివుడు సతీసమేతుడై కనుమ పండుగ రోజున దేవగణాలకు ఆహ్వానం పలుకుతారు.ఇందులో భాగంగా మంగళవారం స్వామి అమ్మవార్లు గిరిప్రదక్షిణగా వెళ్లి దేవగణాలకు ఆహ్వానం అందజేశారు.సోమవారం త్రిశూలం,పల్లకి గిరి ప్రదక్షిణ జరిగింది.మంగళవారం అర్చకులు అలంకార మండపంలో స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు.భక్తుల శివనామ స్మరణ మధ్య స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణ ఉదయం 7.30గంటలకు ఆలయం నుంచి మొదలైంది.వివిధ వాయిద్యాలు,కోలాట నృత్యాల నడుమ పార్వతీ పరమేశ్వరులతో పాటు వేలాది మంది భక్తులు వెంట నడిచారు.విడిది మండపాల వద్ద స్వామి అమ్మవార్లను కొలువుదీర్చగా స్థానిక ఉభయ దారులు నైవేద్యాలు సమర్పించారు.దాతలు పెద్దసంఖ్యలో మంచినీళ్లు,మజ్జిగ,శీతల పానీయాలు, అన్నప్రసాదాలు అందించారు. కైలాసగిరి రిజర్వాయర్ ఎదురుగా అంజూరు వారి మండపం వద్ద ముక్కంటి ఆలయం తరఫున భక్తులకు అన్నదానం చేశారు. ఛైర్మన్ శ్రీనివాసులు, ఈవో రామారావు భక్తులకు అన్నప్రసాదాలు వడ్డించారు. గిరి ప్రదక్షిణకు హాజరు కానివారు పట్టణ శివారులోని శుకబ్రహ్మాశ్రమం వద్దకు సాయంత్రం వేలాదిగా తరలి వచ్చారు. స్వామి అమ్మవార్లు తిరిగి వచ్చేలోపు స్వర్ణముఖి నదిలో పిల్లలు పెద్దలు ఆటపాటలతో కేరింతలు కొట్టారు.కోనేటి మిట్ట ప్రాంతంలోని ఎదురు సేవ మండపం వద్దకు స్వామి అమ్మవార్లు రాగా ప్రత్యేక పూజలు చేసి నైవేద్య హారతులను సమర్పించారు. ఈ ఎదురు సేవలో ఎంపీ గురుమూర్తి , ఎమ్మెల్యే మధుసూదన రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.ఇక్కడి నుంచి ముక్కంటి ఆలయం వరకూ స్వామి అమ్మవార్లు ఊరేగి గిరి ప్రదక్షిణకు స్వస్తి పలికారు. రాత్రి స్వామి అమ్మవార్లు అశ్వసింహ వాహనంపై పురవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.


గిరి ప్రదక్షిణలో ఊరేగుతున్న స్వామి అమ్మవార్లు

పండుగ క్రికెట్ వివాదం
సాఫ్ట్‌వేర్ ఉద్యోగిపై హత్యాయత్నం

గంగవరం, జనవరి 16: క్రికెట్‌మ్యాచ్ ఆగిపోవడానికి నీవే కారణమంటూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని వెంటాడి రాడ్లు, బ్యాట్లతో దాడి చేశారు. ఈ గంగవరం మండలం మార్జేపల్లె సమీపంలో సోమవారం చోటు చేసుకొంది. బాధితులు తెలిపిన ప్రకారం.. మార్జేపల్లెకు చెందిన రెడ్డెప్ప రెడ్డి కుమారుడు సూర్యప్రకాష్ (21) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నారు. సంక్రాంతి పండుగ కోసం రెండు రోజుల కిందట ఇంటికి వచ్చారు. యువకులందరూ కలసి సరదాగా క్రికెట్ ఆడాలని కోరడంతో గ్రామ సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. చెరువు వద్ద మార్జేపల్లె, పసపత్తూరు కురపల్లె, వీరశెట్టిపల్లె గ్రామాలకు చెందిన యువకులు జట్లుగా ఏర్పడి క్రికెట్ మ్యాచ్‌లు ఆడటం మొదలుపెట్టారు. మ్యాచ్ జరుగుతుండగా ఆట మధ్య ఒక ప్లేయర్ రనౌట్ కావడంతో, బ్యాటింగ్ జట్టు నాటౌట్ అని, బౌలింగ్ జట్టు ఖచ్చితంగా ఔట్ అని వాదించుకున్నారు. రెంటు జట్లకు చెందిన వాళ్లు పంతాలు పట్టింపులకు పోయి తాము ఒప్పుకోమంటే ఒప్పుకోం అంటూ భీష్మించుకోవడంతో మ్యాచ్ అర్ధంతరంగా ఆగిపోయింది. మ్యాచ్ ఆగిపోవడంతో సాఫ్ట్‌వేర్ యువకుడు సూర్యప్రకాష్ ద్విచక్ర వాహనంపై మరో స్నేహితుడితో కలసి ఇంటికి బయలుదేరారు. మార్గమధ్యంలో ప్రత్యర్థి జట్టు సభ్యులు కొంతమంది బ్యాట్‌లు, క్రికెట్ స్టిక్స్, రాడ్లతో సూర్యప్రకాష్‌ను వెంబడించి అడ్డుకున్నారు. ద్విచక్రవాహనాన్ని బలవంతంగా ఆపి, వెనుక కూర్చున్న సూర్యప్రకాష్ స్నేహితుడిని ముగ్గురుగట్టిగా పట్టుకోగా, మరో ఏడుగురు యువకులు సూర్యప్రకాష్‌పై బ్యాట్‌లు, స్టిక్‌లు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలైన అతడు సొమ్మసిల్లిపడిపోయారు. దాడిచేసిన వారు పరారవగా, స్థానికులు గుర్తించి గాయపడిన సూర్యప్రకాష్‌ను హుటాహుటిన పలమనేరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో గుడిపాల సీఎంసీకి.. అక్కడ్నుంచి రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. సూర్యప్రకాష్ తమపై దాడి చేశారని ప్రత్యర్థి వర్గానికి చెందినవారు పోలీసులకు ఫిర్యాదుచేశారు. తీవ్రగాయాలైన సూర్యప్రకాష్ ఫిర్యాదు ఇంకా అందలేదని, ఈగొడవపై కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

షర్మిల నియామకం శుభపరిణామం

వెదురుకుప్పం, జనవరి 16: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా (పీసీసీ) వైఎస్ షర్మిల నియామకం శుభ పరిణామమని జిల్లా కాంగ్రెస్ పార్టీ (డీసీసీ) అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ తెలిపారు. వెదురుకుప్పంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. షర్మిల నియామకంతో రాష్ట్రంలోని కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నెలకొందన్నారు. తాజా మాజీ పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజును కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించడం కూడా శుభ పరిణామమని పేర్కొన్నారు.

శ్రీవారి ఆలయంలో తిరిగి మొదలైన సుప్రభాతం

తిరుమల, జనవరి16(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి ఆలయంలో సుప్రభాత సేవ తిరిగి మొదలైంది. పవిత్రమైన ధనుర్మాసం ఆదివారంతో ముగియడంతో సోమవారం వేకువజాము నుంచి శ్రీవారి ఆలయంలో సుప్రభాతసేవ పునఃప్రారంభమయ్యింది. గతేడాది డిసెంబరు 17వ తేదీ తెల్లవారుజాము నుంచి ధనుర్మాస ఘడియలు ప్రారంభమైన నేపథ్యంలో శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. అయితే జనవరి 14వ తేదీతో ధనుర్మాస ఘడియలు పూర్తికావడంతో 15వ తేదీ నుంచి యథాప్రకారం ఆలయంలో సుప్రభాత సేవ నిర్వహించారు.

హుండీ ఆదాయం రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు

తిరుమల వేంకటేశ్వరస్వామికి హుండీ ద్వారా ఆదాయం రెండ్రోజుల్లో రూ.7.02 కోట్లు లభించింది. ఆదివారం రూ.3.13 కోట్లు, సోమవారం రూ.3.89 కోట్లు లభించినట్టు టీటీడీ మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,964 మంది, సోమవారం 86,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ రెండ్రోజుల్లో 57,506 మంది స్వామివారికి తలనీలాలు సమర్పించారు.

టీటీడీకి ఆర్గానిక్ నెయ్యి విరాళం

శ్రీవారికి రూ.22 లక్షల విలువైన ఆర్గానిక్ నెయ్యి సోమవారం విరాళంగా అందింది. పుణెకి చెందిన పరాగ్ ఫుడ్స్ సంస్థ ఆధ్వర్యంలోని భాగ్యలక్ష్మి డెయిరీ వెయ్యి కేజీల ఆర్గానిక్ నెయ్యిని అందించింది. సంస్థ ఛైర్మన్ దేవేందర్ షా, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అక్షాలీషా తరుపున పలమనేరులోని భాగ్యలక్ష్మి డెయిరీ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ నక్రా బృందం ఈ విరాళాన్ని శ్రీవారి ఆలయ డిప్యూటీఈవో లోకనాథం, పడిపోటు సూపరింటెండెంట్ కృష్ణమూర్తికి అందజేసింది.

తిరుమల వేంకటేశ్వరుడికి గోదామాలలు


గోదాదేవి మాలలతో జీయర్‌స్వాములు

తిరుమల, జనవరి 16 (ఆంధ్రజ్యోతి): శ్రీవారికి మహా భక్తురాలైన గోదాదేవి పరిణయోత్సవం పురస్కరించుకుని గోదామాలలను శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం ఉదయం సమర్పించారు. తిరుపతిలోని గోవిందరాజస్వామి ఆలయంలోని ఆండాళ్ గోదాదేవి చెంత నుంచి శ్రీవారికి ప్రత్యేక మాలలు కానుకగా అందాయి. మాలలు తిరుపతి నుంచి తిరుమల పెద్దజీయర్‌స్వామి మఠానికి మంగళవారం ఉదయం చేరుకున్నాయి. అనంతరం మఠం నుంచి మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా శ్రీవారి ఆలయానికి తీసుకొచ్చారు. ఆలయంలో పూజా కార్యక్రమాలయ్యాక మూలవిరాట్టుకు అలంకరించారు. జీయర్ స్వాములు, జేఈవో వీరబ్రహ్మం, డిప్యూటీఈవో లోకనాథం ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైదికోక్తంగా 'కాకబలి'

శ్రీవారి ఆలయంలో ప్రతి ఏడాది కనుమ పండుగను పురస్కరించుకుని ఉదయాత్పూర్వం నిర్వహించే 'కాకబలి' కార్యక్రమం మంగళవారం వైదికోక్తంగా జరిగింది. ఇందులో భాగంగా అర్చకస్వాములు.. పసుపు, కుంకుమ వేర్వేరుగా కలిపిన అన్నాన్ని ఆనంద నిలయం విమాన వేంకటేశ్వరస్వామికి నివేదించారు.

వైభవంగా సంక్రాంతి వేడుకలు

మదనపల్లె అర్బన్, జనవరి16: మదనపల్లె పట్టణ, రూరల్ ప్రాంతాల్లో సంక్రాంతి సంబరాలు సోమవారం వైభవంగా నిర్వహించారు. మహిళలు ఇళ్లముంగిళ్లలో వివిధ రకాల రంగులతో రంగవల్లీలు వేయడం సంక్రాంతి శోభవెల్లివిరిసింది. ప్రతి ఇంట్లో కుటుంబసభ్యులు వివిధ ధాన్యాలతో పొంగళ్ల పొంగించారు. చిప్పిలి గ్రామంలోని మడికయ్యల శివాలయంలో యోగ భోగేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. నీరుగట్టువారిపల్లెలో నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త గుడిరామాంజులు ఆధ్వర్యంలో సంక్రాంతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. అలాగే పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మతసామసర్యాలకు అతీతంగా మదనపల్లె కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు ఎస్.రెడ్డీసాహెబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు వైభవంగా నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి పొంగళ్లను పొంగించారు. ఈ సందర్భంగా ఆయన మదనపల్లె నియోజకవర్గ ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు అధికారులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ఎస్కేబాషా, సురేంద్రరెడ్డి, చలపతి, నాగరాజ, మహబూబ్‌పీర్, మహమ్మద్అలీ, సయ్యద్, సమీర్, రఫీ, ఈశ్వరమ్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

కురబలకోటలో: మండలంలో సంక్రాంతి వేడుకలను ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పశువులను ప్రత్యేకంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం చిట్లాకుప్పల వద్దకు తీసుకెళ్లి ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంటరీ బీసీ సెల్ అధ్యక్షుడు పి.సురేంద్రయాద్, పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అయూబ్‌భాషా, బాలకృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ములకలచెరువులో: మండలంలో సోమవారం సంక్రాంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటి ముంగిట మహిళలు రంగు రంగుల రంగవల్లులు వేశారు. స్థానిక పోలీస్‌స్టేషన్ ఎదుట ఎస్ఐ గాయత్రి ముగ్గులు వేశారు. గ్రామాల్లో సంక్రాంతి పండగ సందడి నెలకొంది. మంగళవారం కనుమ పండగను నిర్వహించారు. పశువులను అలంకరించి గ్రామాల్లో తిప్పారు.

గుర్రంకొండలో: సంక్రాంతి పండుగను మండల ప్రజలు వైభవంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా పశువులను ప్రత్యేకంగా అలంకరించి చిట్లా కుప్పల వద్దకు తీసుకొచ్చారు. ఇందులో భాగంగా ఉదయాన్నే ఇళ్ల ముందు పాలు పొంగలు చేశారు. అనంతరం ఎద్దులు, పాడి ఆవులను ప్రత్యేకంగా అలంకరించి మేళతాలలుతో చిట్లా కుప్ప వద్దకు తోలుకెళ్లారు. చిట్లాకుప్ప వద్ద కాటమరాజుకు ప్రత్యేక పూజలను చేశారు. కాలుతున్న చిట్లా కుప్పలో మహిళలు గుమ్మడి కాయలను వేసి మొక్కులను తీర్చుకొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని పలు గ్రామాలలో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకున్నారు. అలాగే మంగళవారం కనుమ పండుగ రోజున పశువులను ప్రత్యేకంగా అలంకరించి వాటిని బాజాబజంత్రీలతో చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి సంబరాలు జరుపుకు న్నారు.

రామసముద్రంలో: మండలంలో అన్ని గ్రామాలలో సంక్రాంతి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వేకువ జామున ఇళ్లముందు ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి రంగులు వేసి సంబరాలు జరుపుకున్నారు. మంగళవారం సాయంత్రం పశువులను అలంకరించి పూజలు చేసి సంబరాలు చేసుకున్నారు. చొక్కాండ్లపల్లె పంచాయతీ అభివృద్ధి కమిటీ చైర్మన్ బీసీ నాయకుడు గెవన్న, నడింపల్లె సర్పంచ్ ఆదినారాయణ, గుంతలపేట గ్రామంలో మండల టీడీపీ అధ్యక్షుడు విజయ్‌గౌడు, సర్పంచ్ కవితమ్మ గ్రామస్థుల ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ వైభవంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

తంబళ్లపల్లెలో: తెలుగు వారి సంప్రదాయానికి ప్రతీక అయిన సంక్రాంతి పండుగను మండలంలోని గ్రామాల్లో ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, యువతులు ఇళ్ల ముందు రంగురంగుల రంగవల్లికలను వేసి అందులో గొబ్బెమ్మలను పూలతో అలంకరించి పూజలు చేశారు. చిన్నారులు, పెద్దలు గాలిపటాలను ఎగురేస్తూ సందడిగా గడిపారు. మంగళవారం పలు గ్రామాల్లో కనుమ పండుగను ఘనంగా నిర్వహించారు. పశువులను అలంకరించి రకరకాల పిండివంటలను తినిపించి పూజలు చేశారు. సాయంత్రం పశువులను ఊరేగింపుగా కాటమరాజు వద్దకు తీసుకువెళ్లి చిట్లాకుప్ప చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

కలికిరిలో: మండలంలో సంక్రాంతి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. మంగళవారం పలు గ్రామాల్లో కనుమ పండుగను సందర్భంగా పాడి పశువులను ప్రత్యేకంగా అలంకరించి సాయంకాలం చిట్లా కుప్ప వద్దకు చేర్చి సాంప్రదాయ పద్దతిలో చిట్లాకుప్పలకు నిప్పు అంటించి పశువులను బెదిరించారు. మండలంలో కనుమ పండుగ వివిధ గ్రామాల్లో వివిధ రోజుల్లో నిర్వహించనున్నారు.

పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలంలో సంక్రాంతి పండుగలో భాగంగా మంగళవారం కనుమ పండుగను వైభవంగా నిర్వహించారు. పెద్దమండ్యం, పాపేపల్లె, ముసలికుంట, బండ్రేవు, దిగువపల్లె, మందలవారిపల్లె, బండమీదపల్లె, వెలిగల్లు తదితర గ్రామాలలో పశువుల పండుగ రోజున రైతులు పశువులను అలకరించి పురవీధుల లో మేళా తాళాలలతో ఊరేగింపులు నిర్వహించారు. ఆయా గ్రామాల సమీపంలోని కాటంరాజు గుళ్లల్లో ప్రత్యేక పూజల అనంతరం అక్కడే చిట్లాకుప్పల మంటల చుట్టు పశువులను ప్రదక్షిణలు చేయించారు. చిట్లా కుప్పల వద్ద కు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు.

కలకడలో: కనుమ పండుగను మండల ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా పట్టణాల్లో స్థిరపడిన వారు స్వగ్రామాలకు రావడంతో పల్లెలో సందడి వాతావరణం నెలకొంది. రైతులు వారి జీవనధారమైన పశువులను ప్రత్యేకంగా అలంకరించి వైభవంగా ఊరేగిస్తూ చిట్టకుప్ప వద్దకు తీసుకెళ్లి పూజలు చేశారు. అనంతరం చిట్లా కుప్ప వద్ద కాటమరాజుకు మహిళలు ప్రత్యేక పూజలు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని మడుమూరు, అముల్‌దారుని పల్లె, కుర్రావాండ్లపల్లె, బొంతవారిపల్లె, రంగసముద్రం గ్రామాల్లో ప్రజలు సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకున్నారు. మడుమూరు గ్రామం అముల్‌దారునిపల్లెలో మహిళలు గ్రామదేవతలకు జ్యోతులు మోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామ శివారుల్లో చిట్లా కుప్పకు నిప్పు పెట్టి పశువులను గ్రామంలో ఊరేగించారు.

బి.కొత్తకోటలో : బి.కొత్తకోట మండలంలోని బీరంగి, బడికాయలపల్లె, గట్టు, గోళ్లపల్లె తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగను వైభవంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాలలో ఉన్న ఉద్యోగులు, విద్యార్థులు తరలిరావడంతో పల్లెలకు పండుగ శోభ వచ్చింది. బి.కొత్తకోట పట్టణం రెండు రోజుల పాటు కొనుగోలు దారులతో కిటకిట లాడింది. పల్లెల్లో ఇళ్ల ముందు రంగవల్లులతో సుందరంగా దర్శనం ఇచ్చాయి.



తంబళ్లపల్లె, పెద్దమండ్యంలో పశువులను ఊరేగింపుగా చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్తున్న రైతులు


కలికిరిలో చిట్లా కుప్ప వద్ద పశువులతో సహా చేరిన జన సందోహం

చంద్రబాబును కలిసిన టీడీపీ నేత దగ్గుబాటి


మాజీ సీఎం చంద్రబాబుతో దగ్గుబాటి వెంకటేశ్వరరావు

కలకడ, జనవరి 16:తిరుపతి జిల్లా నారావారిపల్లెలో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడును రాజంపేట పార్లమెంటరీ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి దగ్గుబాటి వెంకటేశ్వరరావు కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రబాబు తనను ఆప్యాయంగా పలకరించి పార్టీ అధికారానికి కష్టపడి పని చేయాలని సూచించినట్లు తెలిపారు. అలాగే పీలేరు నియోజకవర్గంలో నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని పేర్కొన్నట్లు తెలిపారు.

టీడీపీ బలోపేతానికి ముస్లిం మైనార్టీలు కృషి చేయాలి


లోకేశ్‌ను కలసిన పఠాన్‌ఖాదర్‌ఖాన్

మదనపల్లె/ టౌన్, జనవరి 16: మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ బలోపేతానికి ముస్లిం మైనార్టీలు కలసికట్టుగా పనిచేయాలని టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్ సూచించినట్లు పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి, పోతబోలు మాజీ సర్పంచ్ పఠాన్‌ఖాదర్‌ఖాన్ తెలిపారు. సోమవారం తిరుపతి జిల్లా నారావారిపల్లెలో నారా లోకేశ్‌ను మర్యాదపూర్వకంగా కలసిన పఠాన్‌ఖాదర్‌ఖాన్ ఆయనకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో ముస్లిం మైనార్టీ ఓట్లు కీలకం కానున్నాయని, ఈ దిశగా కృషి చేయాలన్నారు. మదనపల్లెలో టీడీపీ విజయానికి తన వంతు కృషి చేస్తానని పఠాన్‌ఖాదర్‌ఖాన్ వివరించారు.

టీడీపీ నేత మధుబాబుచే పేదలకు దుస్తులు వితరణ


పండుగ రోజున పేదలకు వస్త్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నేత మధుబాబు

మదనపల్లె టౌన్, జనవరి 16: సంక్రాంతి పండుగ పురస్కరించుకుని టీడీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రాటకొండ మధుబాబు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. సోమవారం మండలంలోని బోడుమలదిన్నె గ్రామంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మధుబాబు మాట్లాడుతూ చంద్రబాబు పాలనతో సంక్రాంతి కానుకలు పంపిణీ చేసేవారని, ఇప్పుడు సీఎం జగన్ పేదలను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. అందుకే తనవంత సాయం గా పేదలకు పండుగ రోజున వస్త్రదానం చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండికోట గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా టీడీపీ నేత బాబురెడ్డి జన్మదిన వేడుకలు


బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఆర్‌జే వెంకటేశ్

మదనపల్లె టౌన్, జనవరి 16: మదనపల్లె మాజీ ఎమ్మెల్యే రాటకొండ శోభ భర్త, టీడీపీ సీనియర్ నేత రాటకొండ బాబురెడ్డి(రెడ్డెప్పరెడ్డి) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం స్థానిక శాస్త్రివీధిలోని బాబురెడ్డి నివాసంలో ఉదయం నుంచే టీడీపీ నాయకులు, పట్టణ ప్రముఖులు ఆయనను కలసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మదనపల్లె, రామ సముద్రం, నిమ్మనపల్లె, కురబలకోట, బి.కొత్తకోట మండలాల నుంచి కూడా టీడీపీ నాయకులు శ్రేయోభిలాషులు పెద్దసంఖ్యలో వచ్చి బాబురెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజుకన్నా రాబోయే ఎన్ని కల్లో చంద్రబాబును మళ్లీ సీఎం చేయడమే ధ్యేయంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని పిలుపునిచ్చారు. కాగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, ఎస్ఏ మస్తాన్, ఆర్‌జే వెంకటేశ్, మధుబాబు, జ్ఞానాంబిక కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్, పెద్దసంఖ్యలో పార్టీ శ్రేణులు బాబురెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత నాయకులు రాటకొండ హర్షవర్ధన్‌రెడ్డి, విష్ణు, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ఉమ్మ డి అభ్యర్థిని గెలిపించుకోవాలి


జనసేన పార్టీ జెండా ఆవిష్కరణలో శ్రీరామ రామాంజనేయులు, అనిత

పెద్దతిప్పసముద్రం జనవరి 16 : రానున్న ఎన్నికల్లో జనసేన-టీడీపీ ఉమ్మడి అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ ప్రధానకార్యదర్శి దారం అనిత, మదనపల్లె జనసేన నాయకుడు శ్రీరామ రామాంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని కందుకూరు గ్రామంలో జనసేన పార్టీ జెండాను వారు ఆవిష్క రించారు. అనంతరం కందుకూరు గ్రామంలో జనసేన-టీడీపీ పార్టీల ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడుతూ తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని జనసైనికులు కందుకూరును ఆదర్శంగా తీసుకుని ప్రతి మండలంలోనూ జనసేన జెండాను ఆవిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జనసేన సీనియర్ నాయకులు దారం హరిప్రసాద్, తంబళ్లపల్లె నియోజకవర్గం పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ సాయినాథ్, మండల అధ్యక్షుడు శంకర, ముద్దసాని నాగరాజు, వెంకటరమణ, మనోహర్, సయ్యద్, షాకీర్, రెడ్డిమోహన్, మదనపల్లె జనసేన నాయకులు నగేష్, అనిల్, మహేష్, శివ, శ్రీరాం హరివరన్, అశ్వత్, ధరణి, హర్ష, సోనూ, వినయ్‌కుమార్‌రెడ్డి, గణేష్, శేఖర్, హరీష్, సురేష్ పాల్గొన్నారు.

పండుగ నాడు కొనసాగిన అంగన్వాడీల సమ్మె


తంబళ్లపల్లెలో ముగ్గులు వేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

తంబళ్లపల్లె, జనవరి 16: తమ డిమాండ్ల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె సంక్రాంతి పండుగ రోజు కొనసాగింది. మంగళవారం నాటికి సమ్మె 36వ రోజుకు చేరుకుంది. తెలుగు ప్రజలకు ముఖ్యమైన పండుగ అయిన సంక్రాంతి, కనుమ పండుగ రోజున కూడా అంగన్వాడీలు తంబళ్లపల్లె మూడు రోడ్ల కూడలిలో సమ్మె శిబిరం వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. సంక్రాంతి పండుగ రోజున శిబిరం వద్ద ముగ్గులు వేసి తమ డిమాండ్లు పరిష్కరించాలని నినదిస్తూ పండుగ మీకు..! పస్తులు మాకా..! అంటూ నిరసన తెలిపారు. పండుగ సందర్భంగా ప్రభుత్వం మనసు మారి అంగన్వాడీల డిమాండ్లు నెరవేర్చి, సమ్మె పరిష్కారం చేసి అందరికీ మంచి చేయాలని వారు కోరుకున్నారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె విరమించేది లేదని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తంబళ్లపల్లె, కురబలకోట, పెద్దమండ్యం మండలాల అంగన్వాడీలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు తల్లీ..


వాల్మీకిపురంలో గంగమ్మ గుడి వద్ద పూజలు చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

వాల్మీకిపురం, జనవరి 16: వాల్మీకిపురంలో మంగళవారం అంగన్వాడీ కార్యకర్తలు సీఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించు తల్లీ.. అంటూ గంగమ్మ తల్లిని వేడుకుంటూ వినూత్న రీతిలో నిరసనచేపట్టారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద నుంచి గొల్లపల్లె క్రాస్‌లోని గంగమ్మ దేవాలయం వద్దకు చేరుకుని పూజలు నిర్వహించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి గత 36రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తల గోడు పట్టడం లేదన్నారు. అనంతరం యూనియన్ లీడర్లు మాట్లాడుతూ పండుగ అని కూడా తమపై ప్రభుత్వానికి కనీస కనికరం లేకుండాపోయిందన్నారు. చర్చలతో బెదిరింపులకు గురిచేస్తున్నారని, ప్రభుత్వం దిగి వచ్చి తమ సమస్యలు పరిష్కరించే దాకా సమ్మె విరమించేది లేదన్నారు. కార్య క్రమంలో సీఐటీయూ అనుబంధ అంగన్వాడీ యూనియన్ లీడర్లు చంద్రావతి, భూమైలే శ్వరి, ప్రసన్న, అమ్మాజి, దేవసేన, లక్ష్మీనరసమ్మ, రెడ్డిరాణి, కలికిరి, గుర్రంకొండ, వాల్మీ కిపురం మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, మినీ వర్కర్లు పాల్గొన్నారు.

బి.కొత్తకోటలో: బి.కొత్తకోట ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె మంగళవారం 36వ రోజుకు చేరింది. కార్యాలయం ఎదుట బైఠాయించి వారు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. ముఖ్య మంత్రి జగన్‌రెడ్డికి మంచి బుద్ధి ప్రసాదిం చాలని దేవున్ని ప్రార్థించారు. నోళ్లు చేతులతో మూసుకుని నిరసన తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి అంగన్వాడీల డిమాండ్లపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మొలకలచెరువు, పీటీఎం, బి.కొత్తకోట మండలాల అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు పాల్గొన్నారు.


బి.కొత్తకోటలో ధర్నా చేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

కుటుంబ కలహాలతో భవన నిర్మాణ కార్మికుడు ఆత్మహత్య


మృతుడు మల్లికార్జున

మదనపల్లె టౌన్, జనవరి 16: కుటుంబ కలహాలతో ఓ భవన నిర్మాణ కార్మికుడు సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మదనపల్లె టు టౌన్ పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ రేగడ గ్రామానికి చెందిన ఎస్.మల్లికార్జున(28) ఫ్లోరింగ్ టైల్స్ పనిచేస్తూ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. స్థానిక అమ్మచెరువు మిట్ట వద్ద భార్య, పిల్లలతో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మల్లికార్జున భార్య మాధవి సంక్రాంతి పండుగకు ఊరెళ్లాలని పట్టుబట్టి భర్తతో గొడవ పడింది. ఈ విషయమై రాత్రంతా ఇరువురి మధ్య వాగ్వాదం జరగడంతో మనస్థాపం చెందిన మల్లికార్జున ఇంట్లోనే మోల్డింగ కమ్మికి ఉరేసుకుని ఆత్మహత్య చేరుకున్నాడు. సమాచారం అందుకున్న టు టౌన్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రి మార్చురికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీ నేత వెంకటరమణ మృతి తీరని లోటు


నివాళులర్పిస్తున్న శ్రీరామ్‌చినబాబు, టీడీపీ నేతలు

నిమ్మనపల్లి, జనవరి 16: నిమ్మనపల్లె మాజీ సర్పంచ్, టీడీపీ నేత శ్రీరాములు తండ్రి వెంకటరమణ మృతి తీరని లోటని రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అగ్రహారంలో నివాసముంటున్న శ్రీరాములు తండ్రి వెంకటరమణ మృతి చెందాడు. దీంతో శ్రీరామ్ చినబాబు సంఘటనా స్థలానికి చేరుకొని వెంకటరమణ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ సర్పంచ్ శ్రీరాములతో పాటు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ఎలాంటి సమస్య వచ్చినా టీడీపీ అండగా ఉంటుందని తెలిపారు. పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మునవ్వర్ రానా సేవలు అజరామరం

మదనపల్లె టౌన్, జనవరి 16: ఉర్దూ సాహితీ ప్రపంచంలో మునవ్వర్ రానా చేసిన సేవలు అజరామరమని ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖలీమ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మార్చురివీధిలోని ఉర్దూ అకాడమి లైబ్రరీలో మునవ్వర్ రానా సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఖలీమ్ మాట్లాడుతూ ఉర్దూ, అవధీ భాషల్లో వేలాది కవితలు రాసిన మునవ్వర్ రానా మృతి చెందడం బాధకరమన్నారు. ఆయన లేని లోటు తీర్చలేనిదన్నారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, ఉపాధ్యాయులు సయ్యద్ హషీం, షరాఫత్ అలి, ఉర్దూ లైబ్రరి సిబ్బంది షౌకత్, వాజిద్, ముజీబ్ పాల్గొన్నారు.

రోడ్డుభద్రత మాసోత్సవాలను విజయవంతం చేయండి

మదనపల్లె అర్బన్, జనవరి 16: ఏపీ రాష్ట్రరోడ్డు రవాణా సంస్థలో ఈనెల 15 నుంచి ఫిబ్రవరి 14 వరకు రోడ్డుభద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని వన్ డిపో మేనేజరు మూరేవెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఇందులో డ్రైవర్లకు డ్రైవింగ్‌పై అవగాహన కల్పిస్తామని తెలిపారు. రోడ్డు రవాణా అధికారులు సలహాలు సూచనలు పాటించాలన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్‌పోన్ మాట్లాడరాదని, మలుపులు, కూడళ్లలో జాగ్రత్తగా డ్రైవ్ చేయాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. అవగాహనతో బస్సులు నడపాలన్నారు.

ఆర్టీసీ బస్సులు బస్టాండుకు రావలసిందే..

కలికిరి, జనవరి 16: మదనపల్లె-తిరుపతి మార్గంలో నడిచే ఆర్టీసీ బస్సులు కలికిరి పట్టణంలోని బస్టాండుకు తప్పనిసరిగా వెళ్ళాల్సిందేనని అధికార్లు స్పష్టం చేశారు. ఈ మార్గంలో వెళ్లే బస్సులు తరచూ బస్టాండుకు రాకుండా క్రాస్‌రోడ్డు నుంచి నేరుగా వెళుతుండటం పరిపాటిగా మారింది. దీంతో రాత్రి వేళల్లో ప్రయాణికులు ప్రధానంగా మహిళలు అష్టకష్టాలు పడాల్సి వచ్చేది. ప్రయాణికులను తీవ్ర అసౌకర్యానికి గురిచేస్తున్నారని ఫిర్యాదులు చేసినా షరా మామూలుగానే మారింది. ఈ దశలో కలికిరి పట్టణానికి చెందిన మునిరత్నం అనే ప్రయాణికుడు ఈ నెల 10వ తేదీన స్పందనలో ఫిర్యాదు చేశాడు. దీని పైన మదనపల్లె-2 డిపో మేనేజరు సత్వరం చర్యలు తీసుకున్నట్లు రాతపూర్వకంగా ఫిర్యాదుదారుడికి తెలిపారు. పట్టణంలోని బస్టాండుకు నిర్ణయించిన సర్వీసులన్నీ తప్పనిసరిగా వెళ్లాల్సిందేనని సిబ్బందికి కఠినమైన ఆదేశాలిచ్చినట్లు అందులో పేర్కొన్నారు. ఉద్యోగులతో తరచూ జరిపే 'గేట్' మీటింగుల్లో కూడా ఇదే విధంగా ఆదేశాలిచ్చామని, నోటీసు బోర్డులో కూడా తగిన ఉత్తర్వులు పెట్టామని డిపో మేనేజరు వివరించారు. అయితే కొన్ని దూరపు ప్రాంత ఎక్స్‌ప్రెస్, నాన్‌స్టాప్ సర్వీసులకు ఇందులో మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. అధికారులిచ్చిన స్పష్టతపై పలువురు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వాలీబాల్ విజేత కోన కింగ్స్ జట్టు


కప్పు అందుకొంటున్న కోన కింగ్స్ జట్టు

కలకడ, జనవరి 16:సంక్రాంతి సందర్భంగా కోన హైస్కూల్ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన వాలీబాల్ పోటీలో కోన కింగ్స్ జట్టు విజేతగా నిలిచి కప్పు అందుకొంది. టోర్నమెంట్ మొత్తం ఐదు జట్లు పాల్గొన్నగా కోన కింగ్స్ జట్టు మొదటి స్థానంలో చేగోవేర జట్టు రెండవ స్థానంలో నిలిచాయి. విజేత జట్టు బహుమతిగా హెచ్ఎం చెంగల్ రాయులు రూ.5 వేలు, రన్నర్ జట్టుకు సుబ్రమణ్యం రూ.2,500 నగదును అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు కిరణ్‌కుమార్, మోహన్, రామాంజులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం


వాల్మీకిపురంలో వైభవంగా అయ్యప్పస్వామి నగరోత్సవం

వాల్మీకిపురం, జనవరి 16: వాల్మీకిపురం పట్టణంలోని కోనేటి వీధిలో వెలసిన అయ్యప్పస్వామి దేవాలయంలో సోమవారం మరకజ్యోతి పూజల అనంతరం వైభవంగా నగరోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవిరాట్‌కు అభిషేకం, అర్చన, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం పుష్పపల్లకిలో అయ్యప్పస్వామికి అలంకరణలు గావించి పట్టణ పురవీధులలో నగరోత్సవం వైభవంగా సాగింది. చివరగా స్థానిక తిరుపతి రోడ్డులోని నూతన అయ్యప్ప దేవాలయం నిర్మాణ ప్రాంతంలో మకరజ్యోతి దర్శన ఏర్పాట్లు చేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న, ప్రసాద వితరణ చేపట్టారు. ఈకార్యక్రమాలలో గురుస్వాములు రామచంద్ర, బలరామ్, శ్రీరాములు, శ్రీనివాసులు, అయ్యప్ప మాలధారణ భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

మదనపల్లె అర్బన్‌లో: మండలంలోని చిప్పిలిగారమంలో వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో సంక్రాంతి సందర్భంగా వైభవంగా భక్తులకు మరకజ్యోతి దర్శనం కల్పించారు. సోమవారం ఉదయం నుంచి సంక్రాంతి సంబరాలు అత్యంత వైభవంగా ఆలయకమిటీ సభ్యులు నిర్వహించారు. అయ్యప్ప స్వామిని ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి, విశేషంగా అలంకరణలు చేసి వందలాదిమందికి స్వామి దర్శనం కల్పించారు. కొంతమంది అయ్యప్పమాలదారులు ఆలయ ఆవరణలో ఇరుముడులు సమర్పించారు. సాయంత్రం స్వామివారికి మరకజ్యోతిని దర్శించడానికి అధిక సంఖ్యలో భక్తులు అయ్యప్పస్వామి ఆలయానికి తరలివచ్చారు. ఆలయంలో భక్తుల సందడితో సంక్రాంతి శోభ నెలకొంది. మదనపల్లె, నక్కలదిన్నెకు చెందిన బందార్లా వేణుగోపాల్ కుటుంబసభ్యులు విజయలక్ష్మీ, హర్షవర్ధన్, గీతాంజలి, చైతన్యకుమార్ ఆధ్వర్యంలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి మూడు పూటల ఆలయానికి విచ్చేసిన వందలాదిమంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా బందార్ల వేణుగోపాల్ మాట్లాడుతూ ఎనిమిది ఏళ్లుగా ఆలయంలో సంక్రాంతిని పురస్కరించుకుని అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా చేస్తున్నట్లుపేర్కొన్నారు,



ప్రత్యేకాలంకరణలో అయ్యప్పస్వామి, అన్నదానం చేస్తున్న దృశ్యం

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



కలకడ, జనవరి 16:ఆచార్య ప్రభోదనంద యోగీశ్వర్లు రచించిన త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం నిర్వహిస్తున్నట్లు త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఇందు జ్ఞానవేదిక పీలేరు కమిటీ అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. కలకడ మండలంలో మూడు రోజులు జరిగే కార్యక్రమంలో మొదటి రోజైన మంగళవారం నడిమిచెర్ల, అగ్రహారం, వడ్డిపల్లెలో ప్రచారాన్ని నిర్వహించామన్నారు. ఈసందర్భంగా భోగి, సంక్రాంతి పండుగల విశిష్టత ఆచారాలు గురించి ప్రజలకు వివరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అనూష, సాలమ్మ, అనంతలక్ష్మీ, జయమ్మ, హర్షవర్ధన్, రుషిత, సౌజన్యలు పాల్గొన్నారు.

నేడు టీడీపీ సర్వసభ్య సమావేశం

పీలేరు, జనవరి 16: పీలేరు మండల టీడీపీ సర్వసభ్య సమావేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి నేతృత్వంలో బుధవారం జరుగుతుందని మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి తెలిపారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు జరిగే సమావేశంలో మండలంలోని అన్నిపంచాయ తీల నాయకులు, కార్యకర్తలు, యూనిట్, క్లస్టర్ ఇన్‌చార్జులు, బూత్ కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు విధిగా పాల్గొనాలని ఆయన తెలిపారు. ఈ నెల 24న పీలేరులో జరగనున్న నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ సమావేశంలో అందరూ విధిగా పాల్గొనాలని ఆయన సూచించారు.

భర్త మందలించాడని భార్య ఆత్మహత్యా యత్నం

బి.కొత్తకోట జనవరి 16 : కట్టుకున్న భర్త మందలించాడని, క్షణికావేశంలో ఓ వివాహిత గొంతుకోసుకున్న సంఘటన సోమవారం బి.కొత్తకోటలో చోటు చేసుకుంది. పట్టణంలో నివాసం ఉంటున్న నరసింహులు, లక్ష్మీదేవి దంపతులు కూలీ పనులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. వారికి ఇరువురు సంతానం ఉన్నారు. మరోసా రి ఆమె గర్భం దాల్చింది. అయితే ఆ విషయం భర్త నర సింహులుకు చెప్పకుండా గర్భస్రా వం అయ్యేలా మాత్రలు మింగింది. విషయం తెలియడంతో భర్త మం దలించా డు. దీంతో ఆమె మన స్తాపం చెంది బ్లేడ్‌తో తన గొంతు కోసు కుంది. తీవ్ర గాయం కావడం తో బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో మదనపల్లెకు తరలించారు.